





ధర్మము

విచారణ

శృతి గీత- 1 , 2







సదాశివ సమారంభాం


గురు దక్షిణామూర్తి


గురు వేదవ్యాస మహర్షి


గురు శుక మహర్షి



గురు నారద మహర్షి


గురు వాల్మీకి మహర్షి


గురు శ్రీకృష్ణ


శంకరాచార్య మధ్యమాం


గురు దత్తాత్రేయ


గురు బాబాజీ



గురు గౌతమ బుద్ధ


గురు ఆదిశంకరాచార్య



గురు రామానుజాచార్యులు


గురు జ్ఞానేశ్వర్


గురు రవిదాస్


గురు కబీర్ దాస్


గురు చైతన్య మహా ప్రభువు



గురు నానక్


గురు రాఘవేంద్ర స్వామి


గురు వీరబ్రహ్మేంద్ర స్వామి


యోగి వేమన

అస్మదాచార్య పర్యంతాం


గురు త్రైలింగ స్వామి


గురు లాహిరి మహాశయ



గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి


గురు వివేకానంద



గురు సాయి బాబా


గురు అరబిందో


గురు రమణ మహర్షి


గురు యోగానంద


గురు భక్తివేదాంత ప్రభుపాద


గురు మళయాళస్వామి


గురు విద్యాప్రకాశానందగిరి


గురు చంద్రశేఖర పరమాచార్య

వందే గురుపరంపరాం..




భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in

Digital Library of India: Inc ×

www.new.dli.ernet.in

Digital Library of India

Hosted by: Indian Institute of Science, Bangalore in co-operation with
CMU, IIIT-H, NSF, ERNET and MCIT for the Govt. of India and 21 major participating centres.

Home | Vision | Mission | Goals | Benefits | Content Selection | Current Status | People | Funding | Copyright Policy | FAQ | RFP

Books Journals Newspapers
Palm-Leaves (Manuscripts)

Title: Ramayanam
Author:
Year: to
Subject: Any Subject
Language: Telugu
Scanning Centre: Any Centre
Clear | Search

Presentations and Report
Statistics Report
Status Report
Feedback | Suggestions | Problems | Missing links or Books

Click here for PDF collection
DLI MIRROR at IUCAA Data Center PUNE

DLI

For the first time in history, the Digital Library of India is digitizing all the significant works of Mankind.

Click Here to know More about DLI New!

Books	Journals	Newspapers	Manuscripts
Rashtrapati Bhavan CMU-Books Sanskrit TTD,Tirupathi Kerala Sahitya Akademi	INSA	Times of India Indian Express The Hindu Deccan Herald Eenadu Vaartha	Tamil Heritage Foundation AnnaUniversity NEW!

Title Beginning with.

A B C D E F G H I J K L M N O P Q R S T U V W X Y Z

Author's Last Name

A B C D E F G H I J K L M N O P Q R S T U V W X Y Z

Year

1850-1900 | 1901-1910 | 1911-1920 | 1921-1930 | 1931-1940 | 1941-1950 | 1951-

Subject

Astrophysics | Biology | Chemistry | Education | Law | Mathematics | Mythology | Religion | For more subjects...

Language


Sanskrit | English | Bengali | Hindi | Kannada | Marathi | Tamil | Telugu | Urdu

అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రుతిగీత - 1

(Commentary on Vedic Instructions to Students)

వ్యాఖ్యానము :

డా॥ జి. ఎల్. ఎన్. శాస్త్రి, M.Sc., M.Phil, Ph.D.

Reader & Head of the Department of Physics,

T. J. P. S. College, Guntur.



జగద్గురు పీఠము - గుంటూరుశాఖ

(THE WORLD TEACHER TRUST - GUNTUR BRANCH)

గుంటూరు - 522 002

ముందుమాట

ప్రస్తుత సమాజములో తల్లిదండ్రులకు - పిల్లలకు; అధ్యాపకులకు-విద్యార్థులకు; గురువులకు-శిష్యులకు మధ్య అంతరము (Generation gap) రాను రాను పెరిగిపోవుచున్నది. ఇది జాతికి, జాతి సంస్కృతికి తీరని నష్టమును తెచ్చిపెట్టును. ఈ విషయము పట్ల బాధ్యతగల ప్రతి పౌరుడును స్పందించి తనకు మంచిదనిపించిన పరిష్కార మార్గమును చేపట్టినచో మన పూర్వ జాతి సంస్కృతిని తిరిగి నిలబెట్టుకొనగలము. ఈ ఉద్దేశ్యముతోనే – ఒక గ్రంథకర్తగా, ఒక అధ్యాపకునిగా అన్నిటికిని మించి ఒక దేశ పౌరునిగా నేను చేయగలిగిన ప్రయత్నమే ఈ ప్రస్తుత 'శ్రుతి గీతా' సారాంశము. భారతీయులకు పరమప్రమాణమైన వేదమునందలి విద్యార్థులకు చెప్పిన హితోపదేశ మంత్రములకు – అర్థము, తాత్పర్యము మరియు వివరణ గూడా సులభమైన శైలిలో ఈ చిన్న పుస్తకమునందు పొందుపరచబడినవి.

విద్యాభ్యాసము పూర్తి అయిన తరువాత బ్రహ్మచర్యాశ్రమములో నుండి గృహస్థాశ్రమములోనికి అడుగుపెట్టుటకు ముందు విద్యార్థికి గురువు ఇచ్చు ఉపదేశము చాల ప్రధానమైనది, ఉపయోగకరమైనది. విద్యాభ్యాసకాలములో విద్యమీదనే తన దృష్టిని కేంద్రీకరింపవలసిన విద్యార్థికి ఇతర విషయములు అంతగా తెలియుటకు అవకాశము తక్కువ. అటువంటి వ్యక్తి ఇకముందు సంసారములోను, సమాజములోను అడుగుపెట్టవలసి వచ్చును. అందువలన ఒక గృహస్థుగా, ఒక సంఘజీవిగా ఈ రెంటినీమించి ఒక యోగసాధకునిగా తన ప్రవర్తనను ఎట్లు రూపొందించుకొనవలెనో చెప్పు ఉప

నిషత్ మంత్రభాగమే ఈ 'శ్రుతి గీతా' సారాంశము. ఇది కేవలము ఒక విద్యార్థికి అవసరమగు హితోపదేశమేగాదు. భారతీయ సంస్కృతిపై సరిఅయిన అవగాహన కావలసిన ప్రతి వ్యక్తికి అవసరమైన సందేశముగూడా!

శ్రీ మహాభారతములోని భగవద్గీత ఒక చక్కని ఉపదేశము. ఇందు ఆచార్యుడు లేదా గురువు – సాక్షాత్తు శ్రీమన్నారాయణుని అవతారమైన శ్రీకృష్ణభగవానుడు. శిష్యుడు – నరుడైన అర్జునుడు. శిష్యుని కర్తవ్యోన్ముఖుని చేయుటయే ఇక్కడ గురువు చేయు ఉపదేశము. యోగమును, యోగజీవన విధానమును సమన్వయపరచి చెప్పు తైత్తిరీయోపనిషత్తులోని భాగమైన ప్రస్తుత 'శ్రుతిగీత'ను ఉపదేశించు గురువు వేదపురుషుడే! ఉపదేశము గీతవంటిదే! అందువలననే ఈ పుస్తకమునకు పేరు 'శ్రుతి గీత' అని పెట్టబడినది.

ప్రతి విద్యాలయమునందు ముఖ్యముగా విశ్వవిద్యాలయములందు విద్యాభ్యాసానంతరము పట్టాలను (Degree) ఇచ్చునపుడు విద్యార్థుల నుద్దేశించి ఏర్పాటుచేయు వీడ్కోలు సభ, లేదా స్నాతకోత్సవ సభ (Convocation Function) లో ఈ పుస్తకమునందు తెలిపిన విషయములను తెలియచెప్పినచో వ్యక్తిగత, సామాజిక జీవన విధానములపట్ల, మనసంస్కృతిపట్ల విద్యార్థికి కలుగవలసిన నిర్మాణాత్మకమైన మార్పు తప్పక కలుగును. ఇటువంటి హితోపదేశ సారాంశములు విద్యాప్రణాళికలో లేకపోవుటచేతనే తరముల మధ్య అంతరములు, సమస్యలు పెరుగుచున్నవి. ఈ పుస్తకములో ముందు మంత్రభాగము సస్వరముగను, అటుపైన తాత్పర్య వివరణలును ఇవ్వబడినవి. మంత్రభాగమునందు ఆసక్తి లేనివారు, స్వరమును చూసి భయపడువారు సూటిగా తాత్పర్య వివరణలను చదువుకొనవచ్చును.

విద్యార్థి, ఉపాధ్యాయ. విద్యాసంస్థలకు చక్కగా ఉపయోగ పడు ఈ పుస్తక ప్రచురణ కృషికి శబ్దరహితముగా నాతో సహక రించిన చి॥ సూరపరాజు హనుమాన్ప్రసాద్‌కు శుభాశీస్సులు, జగద్గురు పీఠము తరఫున కృతజ్ఞతలు.

అతి తక్కువ కాలములో, అత్యంత ఆదరభావముతో, ఆవి ష్కరణ ముహూర్తమునకు చాల వ్యవధానముగా ముందే పుస్తక మును ముద్రించి ఇచ్చిన 'వెల్‌కమ్ ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ గుంటూరు' వారికి కృతజ్ఞతాపూర్వక ధన్యవాదములు.

— జి. ఎల్. ఎన్. శాస్త్రి

ప్రత్యేక కృతజ్ఞతలు

'జగద్గురు పీఠము - గుంటూరుశాఖ' నిర్వహించు వివిధ సేవా కార్యక్రమములు బాగుగా నచ్చి, ఈ 'శ్రుతిగీత-1' పుస్తక ప్రచురణకు ఆర్థికసహాయముచేసిన దాతలు :

పసుపుల రాజుగారు
తులసి మాన్షన్
3/2 అరండల్ పేట,
గుంటూరు-2. రూ. 1116/-

B. V. సుందరరామారావుగారు
ఆడిటర్
హజారావారివీధి,
గుంటూరు-3. రూ. 1116/-

వీరికి నా తరఫున, మా సంస్థతరఫున కృతజ్ఞతాపూర్వక ధన్యవాదములు. భగవంతుడు వీరికి, వీరి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యైశ్వర్యములను ప్రసాదించుగాక !

— జి. ఎల్. ఎన్. శాస్త్రి

ప్ర తి గీ త

మంత్రము :-

వేద మనూచ్యాఽఽచార్యోఽంతేవాసిన మనుశాస్తి।

సత్యం వద। ధర్మం చర। స్వాధ్యాయాన్మా ప్రమదః। ఆచా
ర్యాయ ప్రియం ధన మాహృత్య ప్రజాతంతు మా వ్యవ
చ్ఛేత్సీః। సత్యాన్న ప్రమదితవ్యమ్। ధర్మాన్న ప్రమదిత
వ్యమ్। కుశలాన్న ప్రమదితవ్యమ్। భూత్యై న ప్రమదిత
వ్యమ్। స్వాధ్యాయప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్। దేవ
పితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్। మాతృ దేవో భవ।
పితృ దేవో భవ। ఆచార్య దేవో భవ। అతిథి దేవో భవ।
యాన్యనవద్యాని కర్మాణి। తాని సేవితవ్యాని। నో ఇత

రాణి। యాన్యస్మాకగ్ం సుచరితాని। తాని త్వయోపా
స్యాని। నో ఇతరాణి। యే కే చాస్మచ్ఛ్రేయాగ్ంసో
బ్రాహ్మణాః। తేషాం త్వయాఽఽసనేన ప్రశ్వసితవ్యమ్।
శ్రద్ధయా దేయమ్। అశ్రద్ధయాఽదేయమ్। శ్రియా దేయమ్।
హ్రియా దేయమ్। భియా దేయమ్। సంవిదా దేయమ్।
అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్।
యే తత్ర బ్రాహ్మణా స్సమ్మర్శినః। యుక్తా ఆయుక్తాః।
అలూక్షా ధర్మ కామాస్స్యుః। యథా తే తత్ర వర్తేరన్।
తథా తత్ర వర్తేథాః। అథాభ్యాఖ్యాతేషు। యే తత్ర
బ్రాహ్మణాస్సమ్మర్శినః। యుక్తా ఆయుక్తాః। అలూక్షా
ధర్మ కామాస్స్యుః। యథా తే తేషు వర్తేరన్। తథా తేషు

నక్తేథాః । ఏష ఆదేశః । ఏష ఉపదేశః । ఏషా వేదోపనిషత్ ।
ఏత దనుశాసనమ్ । ఏవ ముపాసితవ్యమ్ । ఏవ ముచైత
దుపాస్యమ్ ॥

టీక :- వేదం = వేదమును; అనూచ్య = బోధించి; ఆచార్యః = ఆచార్యుడు లేదా గురువు; అంతేవాసినమ్ = శిష్యుని లేదా విద్యార్థిని; అనుశాస్తి = శాసించుచున్నాడు; సత్యం = సత్యమును; వద = పలుకుము; ధర్మం = ధర్మమును; చర = ఆచరింపుము; స్వాధ్యాయాత్ = అధ్యయనమునుండి; మా ప్రమదః = పొరపాటు పడకుము; ఆచార్యాయ = ఆచార్యుని కొరకు; ప్రియం = ఇష్టమైన; ధనమ్ = ధనమును; ఆహృత్య = ఇచ్చి; ప్రజాతంతుం = సంతతి క్రమమును; మావ్యవచ్ఛేత్సీః = విచ్ఛిత్తిని కలుగజేయకుము; సత్యాత్ = సత్యమునుండి; (అనగా సత్యమును పలుకు విషయముపట్ల); నప్రమదితవ్యమ్ = పొరపాటు పడకుము; ధర్మాత్ = ధర్మమునుండి (అనగా ధర్మము విషయములో); నప్రమదితవ్యమ్ = పొరపాటు పడకుము; కుశలాత్ = రక్షణ విషయములో; భూత్యై = శ్రేయస్కరమైన, శుభమైన పనుల విషయములో; స్వాధ్యాయప్రవచనాభ్యామ్ = చదువుకొనుట, ఇతరులకు చెప్పుట విషయములలో; దేవపితృకార్యాభ్యామ్ = దేవ పితృ కార్యముల నాచరించు విషయములో; నప్రమదితవ్యమ్ = పొరపాటు పడకుము (అనగా యథావిధిగా ఆచరింపుము); మాతృదేవోభవ = తల్లియే దైవముగా కలవాడవు అగుము; పితృదేవోభవ = తండ్రియే దైవముగా కలవాడవు

అగుము; ఆచార్యదేవోభవ=గురువే దైవముగా కలవాడవుఅగుము; అతిథిదేవోభవ = అతిథియే దైవముగా కలవాడవు అగుము;యాని= ఏ; కర్మాణి=పనులు; అనవద్యాని=నింద్యములుకావో; తాని=అట్టి పనులే (త్వయా = నీచేత); సేవితవ్యాని = సేవించదగినవి; ఇత రాణి = ఇతరమైన పనులు; అనగా నింద్యములైనవి; నో = వద్దు; (వలదు, చేయకుము); అస్మాకం=మా యొక్క; యాని సుచరితాని= ఏ మంచి పనులుకలవో; తాని = ఆ మంచిపనులే; త్వయా=నీచేత; ఉపాస్యాని = ఉపాసించతగినవి; అనగా చేయతగినవి; ఇతరాణి = ఇతరమైన పనులు అనగా మేము చేయు మంచిపనులు కానివి; నో= చేయకుము; యేకేచ = ఎవరైనను; అస్మత్ = మనకంటె లేదా మా కంటె; శ్రేయాగ్ంసః = శ్రేష్ఠులు, (ఐన) బ్రాహ్మణాః = బ్రాహ్మ ణులు, (నీ దగ్గరకు వచ్చుచున్నచో) తేషాం = వారికి; త్వయా = నీ చేత; ఆసనేన = ఆసనము ఇచ్చుటచేత; ప్రశ్వసి తవ్యమ్ = శ్రమను పోగొట్టవలెను; శ్రద్ధయా = శ్రద్ధతో; దేయమ్ = ఇవ్వవలెను; అశ్రద్ధయా = అశ్రద్ధతో; అదేయమ్ = ఇవ్వకూడదు; శ్రియా = ఐశ్వర్యము ననుసరించి అనగా తాహతును బట్టి; దేయమ్ = ఇవ్వవలెను; హ్రియా = సిగ్గుపడుచు; దేయమ్ = ఇవ్వవలెను; భియా = భయపడుచు లేదా ఓడియపడుచు; దేయమ్ = ఇవ్వవలెను; సంవిధా = చక్కగా తెలిసికొనిన జ్ఞానముచేత; దేయమ్ = ఇవ్వవలెను; అథ = అటుపైన; తే = నీకు; కర్మవిచికి త్సావా = కర్మనుగూర్చి సందేహముగాని, వృత్త విచికిత్సావా = ప్రవర్తననుగూర్చి సందేహము గాని; యది = సంభవించినచో: తత్ర = ఆ దేశకాలములందు అనగా అందుబాటులో నున్న; యే బ్రాహ్మణాః ఏ బ్రాహ్మణులు; సమ్మర్శినః = చక్కగా విమర్శించు టకు లేదా వివరించి చెప్పుటకు సమర్థులును; యుక్తాః = యుక్తమైన

వారును; అనగా అయా కర్మలను ఆసక్తితో బాగుగా చేయువారును= ఆయుక్తాః = ఇతరుల ప్రేరణవలన కాక తమంత తాము ఆచరించు వారును; అలూక్షాః = క్రూరస్వభావము లేనివారును; ధర్మకామాః= ధర్మమునందు ఆదరము కలవారును; స్యుః = అగుచుందురో; తే= అట్టివారు; తత్ర = ఆ విషయములందు అనగా నీకు సందేహము కల్గిన విషయము లందు; యథా = ఏ విధముగా; వర్తేరన్ = ప్రవర్తింతురో; తథా = ఆ విధముగా; తత్ర = ఆ విషయములందు అనగా నీకు సందేహము కల్గిన విషయములలో; వర్తేథాః = ప్రవర్తింపుము; అథ = (ఇంకను) అటుపైన; అభ్యాఖ్యాతేషు = దోషులని సంశయింపబడుచున్నవారి విషయమందు; తత్ర = ఆ దేశ కాలములందు అనగా అందుబాటులో నున్న; యే బ్రాహ్మణాః - ఏ బ్రాహ్మణులు; సంమర్శినః = చక్కగా విమర్శించుటకు లేదా వివరించి చెప్పుటకు సమర్థులును; యుక్తాః = యుక్తమైనవారును; ఆయుక్తాః = ఇతరుల ప్రేరణ లేక తమంత తాము ఆచరించు వారును; అలూక్షాః = క్రూరస్వభావము లేనివారును; ధర్మకామాః = ధర్మమునందు ఆదరము కలవారును; స్యుః = అగుచునుందురో; తే = వారు; తేషు = వారి విషయములో; యథా = ఏ విధముగా; వర్తేరన్ = ప్రవర్తించెదరో; తథా = ఆ విధముగా; తేషు = అట్టి (దోషులని సంశయింపబడు) వారి విషయములో; వర్తేథాః = ప్రవర్తించుము; ఏషః= ఈ చెప్పిన విషయము; ఆదేశః =అజ్ఞ; ఏషః = ఈ విషయము; ఉపదేశః = ఉపదేశము లేదా సలహా; ఏషా = ఈ విషయము; వేదోపనిషత్ = వేద సారాంశము; ఏతత్ = ఇది; అను శాసనమ్ = శాసించు వాక్యము; ఏవం ఉచ = ఈ విధముగానే కూడా; ఏతత్ = ఇది; ఉపాస్యమ్ = ఉపాసింపదగినది అనగా ఆచరింపదగినది.

తాత్పర్యము :— ఆచార్యుడు శిష్యునకు వేదమునంతయు చక్కగా బోధించిన తరువాత అటుపైన ఆచరించవలసిన, ఉపయోగ కరములైన విషయములను శాసించి చెప్పుచున్నాడు. సత్యమునే పలుకుము, ధర్మమునే ఆచరింపుము, అధ్యయన విషయములో పొరపాటు పడకుము (ఆచార్యునికి ఏదైన దక్షిణగా సమర్పించ వలెనని అనిపించినచో) ఆచార్యునికి ఇష్టమైన ద్రవ్యమును తెచ్చి యిమ్ము. పుత్ర పౌత్రాదులనుపొందు విషయ క్రమమునకు అవరోధ మును కలిగించకుము. సత్యమును పలుకుటలో, ధర్మమును ఆచరించుటలో రక్షణ విషయములో, శ్రేయస్కరమైన శుభకార్యము లనుచేయు విషయములో, దేవతా సంబంధమైన, పితృసంబంధమైన పనులను నెరవేర్చు విషయములోను పొరపాటును, ఏమరపాటును పడకుము. తల్లిని, తండ్రిని, ఆచార్యుని, అతిథిని దేవతలుగా భావించి పూజింపుము. నింద్యములుకాని పనులను చేయుము, నింద్యములైన పనులను చేయకుము. మేముచేయు మంచిపనులే చేయుము. మేము ఏవైనా (పొరపాటున) మంచివి కానివి చేయుట జరిగినచో వానిని చేయకుము.

మనకంటె అనగా నీకంటె, నాకంటె ఎవరైనా శ్రేష్ఠులైన బ్రాహ్మణులు నీకడకు వచ్చినచో ఎదురేగి, తోడ్కొనివచ్చి, ఆసనము మొదలైనవాటిని కలుగచేసి, వారిని సేవించి, బడలిక తీర్చుము. ఇచ్చునపుడు శ్రద్ధతో ఇమ్ము. అశ్రద్ధతో ఈయకుము. నీ సంపద, తాహతునుబట్టి ఇమ్ము. సిగ్గుపడుచు, భయపడుచు, ఇచ్చునది ఎవరికో తెలిసికొని ఇమ్ము.

ఎప్పుడైనను పనుల నాచరించు విషయములో సందేహము వచ్చినపుడు — నీకు అందుబాటులోనుండి, చక్కగా విమర్శించి,

విడమరచి యుక్తమైన రీతిలో చెప్పగల సమర్థులును; ఇంకొకరు చెప్పకయే మంచిపనులను ఆచరించువారును; క్రూర స్వభావములేని వారును; ధర్మమునందు ఆదరాభిమానములు కలవారును ఐన - బ్రాహ్మణులు నీవు సందేహపడు విషయములలో లేదా సందర్భము లలో ఏవిధముగా ఆచరించుదురో లేదా ప్రవర్తించురో ఆవిధము గానే నీవును అట్లే ప్రవర్తింపుము.

ఎప్పుడైనను దోషులని సంశయింపబడుచున్న వారివిషయ ములో ఏమిచేయవలెనని సందేహము వచ్చినపుడు - నీకు అందు బాటులోనుండి చక్కగా విమర్శించి, విడమరచి, యుక్తమైన రీతీలో చెప్పగల సమర్థులును, ఇంకొకరు చెప్పకయే మంచిపనులను ఆచరించువారును; క్రూర స్వభావము లేనివారును: ధర్మమునందు ఆదరాభిమానములు కలవారునుఐన బ్రాహ్మణులు – నీవు సందేహ పడు విషయములో ఏవిధముగా నిర్ణయము తీసికొని ప్రవర్తించెదరో నీవు - కూడ అదేవిధమైన నిర్ణయమును ప్రామాణికముగా తీసికొని ప్రవర్తింపుము.

ఈ పైన చెప్పిన విషయములను ఆదేశముగా తీసుకొనుము. లేదా ఉపదేశముగా తీసికొనుము. ఈ విషయములన్నియు వేద సారాంశముగా, శాసన వాక్యములుగా ఉపాసన చేయుము. ఇదియే నీకు నిజముగా ఉపాసింపదగిన విషయము.

వివరణము :- వేదవిద్యనంతను ఆమూలాగ్రము బోధించి, వివరించిన తరువాత ఆచార్యుడు శిష్యునికి ఇకముందు పాటింపవల సిన నియమములను, (instructions) చేయవలసిన పనులను, ఉండ వలసిన ప్రవర్తనను గూర్చి ఈ అనువాకములో శాసనపూర్వకముగా చెప్పను. అందుచే దీనిని 'అనుశాసన అనువాకము' అందురు.

బ్రహ్మచర్యాశ్రమములో శిష్యుడు ఆచార్యుని వద్ద విద్య లన్నియు పూర్తిచేయును. అటుపైన గృహస్థాశ్రమములో అడుగు పెట్టవలసియుండును. ఆ సందర్భములో ముందుగా "సత్యం వద" అను శాసనముతో ప్రారంభించి "ఏవ ముపైత దుపాస్యమ్" అను వాక్యమువరకు ఆచార్యుడు శిష్యునకు చెప్పును. ఈ రోజులలో కూడా విశ్వవిద్యాలయములో పట్టా (Degree) ప్రదానము జరిగిన తరువాత ఆ స్నాతకోత్సవ సభలో (Convocation function) పెద్ద వారైన ఒకరిచేత విద్య పూర్తిచేసినవారి నుద్దేశించి ఇదేవిధముగా స్నాతకోత్సవ ప్రసంగమును (Convocation Address) ఏర్పాటు చేయుదురు. ఈ అనువాకములో చెప్పిన విషయములు ఇట్టి సందర్భములో చెప్పినచో ఎంతయో సమంజసముగా, సముచితముగా ఉండును. ఇక ఈ అనువాకములో చెప్పబడిన అట్టి మంచి విషయములకు వివరణ తెలుపబడును.

"సత్యం వద" అని ముందుగా చెప్పెను. 'సత్యమునే పలుకుము' అని దీని అర్థము. బ్రహ్మచర్యాశ్రమమును వదలి గృహస్థాశ్రమములో అడుగు పెట్టినపుడు విద్యార్థి ఎన్నో లౌకిక విషయములను ఎదుర్కొనవలసివచ్చును. ఐనప్పటికి, ఎట్టి పరిస్థితులలోనైనను సత్యమును విడనాడరాదు, విశ్వామిత్రుడు తపస్సంతయును పూర్తిచేసిన తరువాత దేవతలు వశిష్ఠునిచే విశ్వామిత్రుడు బ్రహ్మర్షి ఆయెనని ఒప్పించిరి, అప్పుడు విశ్వామిత్రుడు వశిష్ఠునితో ఈ మాట మొదటనే అన్నచో నీ కుమారులు వందమంది నాచే హతులై ఉండెడివారుకాదుగదా! అనగా - అప్పుడు వశిష్ఠుడు - నీవప్పుడు బ్రహ్మర్షివికావు. మరి నేను నా కుమారులకొరకై నీవు బ్రహ్మర్షివైతివని ఎట్లు అనృతము పలుకగలను ? "సత్యం పుత్ర శతాద్వరమ్" అనెను. అనగా ఒక సత్యవాక్యము వందమంది

పుత్రులకన్న శ్రేష్ఠమైనది' అను అర్థములో పలికెను. దీనినిబట్టి సత్యమునకు ఎంత ప్రాముఖ్యముకలదో వశిష్ఠునివలన తెలియును. మను ధర్మశాస్త్రములోకూడ "సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియమ్, ప్రియంచనానృతమ్ బ్రూయాత్, ఏష ధర్మస్సనాతనః" అని సత్య, ప్రియ వచనములయొక్క ప్రాముఖ్యము నొక్కి వక్కాణింపబడెను. "సత్యాన్నాస్తి పరోధర్మః, అని ఆర్యోక్తికూడ కలదు. "There is no religion higher than Truth" అని దివ్యజ్ఞాన సమాజమువారుకూడ తమ సంస్థకు ముఖ్య సూత్రముగా తెలుపుదురు. "సత్యం వద" అనునప్పుడు "Speak Truth" అను ఇంగ్లీషు అనువాదముగాని, 'సత్యమును పలుకుము' అను తెలుగు అనువాదముకాని నూటికి నూరుపాళ్ళు సరిపోయినవని చెప్పుటకు వీలులేదు. సత్యమును పలుకుటయేగాక 'సత్యము పలుకబడునట్లు, సత్యము వర్ధిల్లునట్లు చూడుము'. అను ఒక విధమైన శాసన పూర్వకమైన ఆజ్ఞగా ఆచార్యుడు శిష్యునికి ఉపదేశించినట్లు కూడ అర్థముచేసికొనవలెను.

"ధర్మంచర" అనగా 'ధర్మమునే ఆచరింపుము' అని అర్థము. ధర్మమనగా న్యాయము, వృత్తి, లక్షణము. కర్మ, స్వభావము అను అర్థములు చాల చెప్పుకొనవచ్చును. కాని ఇక్కడ హృదయము ప్రబోధించు మార్గములో పనులు చేయుమని ధర్మపదమునకు అర్థము చెప్పుకొనవలెను. ఎందువలననగా ధర్మమునకు పుట్టినిల్లు హృదయము. అందుచేతనే కృష్ణపరమాత్మ ఉపదేశించిన గీతలో ప్రథమశ్లోకము "ధర్మ-క్షేత్రే" అనుపదములతోప్రారంభింపబడినది. హృదయమే ఈ ధర్మక్షేత్రము; కురుక్షేత్రమని పెద్దలు చెప్పుదురు. భారతములో యక్షుడు దర్మరాజును 'ధర్మాచరణ విషయములో

దేనిని ప్రమాణముగా తీసుకొనవలె' నని అడిగినపుడు, ధర్మరాజు "ధర్మస్యతత్త్వం నిహితం గుహాయామ్" అనగా, ధర్మము గుహయైన హృదయమునందు ఉండునని, ఆ హృదయప్రబోధమును ప్రమాణముగ తీసుకొనుమని చెప్పెను. ఈ ధర్మమును ధర్మముకొరకే ఆచరించవలెను. అంతేకాని, ధర్మమును ఆచరించినచో రక్షణకల్గునను క్షత్రియ ధర్మరీతిలోగాని. ధర్మమును ఆచరించినచో ప్రయోజనము కలుగునను వైశ్యధర్మరీతిలోగాని, ధర్మమును ఆచరించనిచో శిక్షించుదురను శూద్ర ధర్మరీతిలోగాని ఆచరించరాదు. 'ఎందుకు ధర్మమును ఆచరించితివి' అని ప్రశ్నించినపుడు 'అట్లాచరించుట ధర్మముకాబట్టి' అను బ్రాహ్మణ ధర్మరీతిలోమాత్రమే సమాధానము ఉండవలెనుగాని వేరొకహేతువేదియు ధర్మాచరణమునకు కారణము కారాదు. (ఇక్కడ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను మాటలు గౌణార్థములో వాడబడినవిగాని కులములను తెలియజేయునవికావు) ముందు, వాక్కుతోచేయు కర్మనుగురించి 'సత్యంవద' అని చెప్పి; ఆచెప్పినదానిని కర్మణాచేయుటలో ధర్మబద్ధముగా నుండవలెనని శాసించుట జరిగినది.

"స్వాధ్యాయాన్మాప్రమదః" అనగా 'అధ్యయనము చేయుటలో పొరపాటుపడకుము' అని అర్థము. 'స్వ+అధ్యయనము' అని విడదీసినచో 'స్వ' అనగా 'తన-'శీల, ప్రవర్తనాదులవిషయమై' లేదా 'ఆత్మజ్ఞాన సముపార్జనవిషయమై' ఎప్పటికప్పుడు ఆత్మవిమర్శచేసికొనుచు జాగ్రత్తపడుచుండు' మని గూడ చెప్పుకొనవచ్చును. (తన విషయమై, అన్నపుడు నీవు-నీగురించి అని ఇక్కడ విద్యార్థిపరముగా అర్థము చెప్పుకొనవలెను.) ఇందువలన తననుగురించి తాను ఎక్కువగా విత్తయించుకొనుటలో (over estimation) పర్యవేక్షణ

(Checking) జరుగును. ('మా ప్రమదః' అనునది 'పొరపాటు పడకుము' అని ఈ 'పర్యవేక్షణ' అర్థమును సూచించును.) బ్రాహ్మణునకు విధించిన షట్కర్మలలో మొదటిది అధ్యయనము. ఇక మిగిలినవి అధ్యాపనము, యజనము, యాజనము; దానము. ప్రతిగ్రహములు.

"అధ్యాపన మధ్యయనం యజనం యాజనంతథా।
దానం ప్రతిగ్రహంచైవ బ్రాహ్మణానామ కల్పయత్॥

అని, మను ధర్మశాస్త్రము చెప్పును. "చదువుట. చదివించుట; మంచి పనులు చేయుట-చేయించుట, దానమిచ్చుట-ఇతరులిచ్చిన దానమును పుచ్చుకొనుట – ఈ ఆరును బ్రాహ్మణుడు చేయవలసిన పను" లని దీని అర్థము. అందుచే, ప్రతిదినము మంచివిషయములైన వేద శాస్త్రాది గ్రంథాధ్యయనము తప్పక చేయవలెను. ఇంకొకరికి సందేహము వచ్చినపుడు అడిగినచో నివృత్తి చేయవలెనన్నను, అప్పటికప్పుడు చెప్పగలిగియుండవలెనన్నను తప్పనిసరిగా మస్త కములోనికి పుస్తకములోని విషయములన్నియు పొరపాటులేకుండ ఎక్కవలెను. అందులకై నిత్యము అధ్యయనముచేయుట చాల మంచి దనిచెప్పుటజరిగినది. ఇక్కడ "ప్రమదః" అనగా "ప్రమాదము" అను అర్థమును చెప్పుకొనరాదు. "ప్రమదః" అనగా 'పొరపాటు' అని చెప్పుకొనవలెను. "ప్రమాదోధీమతామపి" అనగా 'బుద్ధిమంతులుకూడ పొరబడుటకు అవకాశముకలదు.' అను అర్థములోనే ఈ ఆర్యోక్తి చెప్పబడినది. అధ్యయనమునుండి పొరబడరాదు అనగా అధ్యయ నము మరువరాదనియు, అధ్యయనముచేయు పుస్తకములోని విషయములు చెప్పుటలోగాని, చేయించుటలోగాని పొరపాటు రాకూడదనియు అర్థములు చెప్పుకొనవచ్చును.

"ఆచార్యాయ ... మాప్రజాతన్తుం మావ్యవచ్ఛేత్సీః"

విద్యనంతయు ఆచార్యునివద్ద నేర్చుకొనినతరువాత ఆచార్యునికి గురుదక్షిణగా ఏదైనఈయవలెనని శిష్యునకు అనిపించినచో అపుడు గురువునకు ఇష్టమైనదేదైన తెచ్చి ఈయవలెను. ఆచార్యుడు నోరు తెఱచి అడుగరాదు. ఆచార్యుడు అడుగకపోయినను శిష్యుడు తెచ్చి యిచ్చుట తప్పుకాదు. ఆవిధముగా శిష్యుడిచ్చిన గురుదక్షిణను గురువు స్వీకరించుట తప్పుకాదు.

బ్రహ్మచర్యాశ్రమములో విద్యపూర్తి చేసి నేర్చుకొనిన తరువాత శిష్యుడు గృహస్థాశ్రమములో అడుగుపెట్టవలెనను విషయము ఇక్కడ విచిత్రముగ చెప్పబడినది. నాలుగు ఆశ్రమములలో గృహస్థాశ్రమము విశిష్టమైనది. మిగిలిన బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాసాశ్రమములవారు ఈ గృహస్థులపైననే తమ భోజనాదికములకు ఆధారపడి యుందురు. "యథా మాతరమాశ్రిత్యసర్వే జీవన్తి జంతవః, తథా గృహస్థ మాశ్రిత్య సర్వే జీవన్తి మానవాః" అని మను ధర్మశాస్త్రము చెప్పును. సర్వజంతువులును తల్లిని ఆశ్రయించుకొని బ్రతుకునట్లు సర్వమానవులు గృహస్థును ఆశ్రయించుకొని బ్రతుకుదురని దీనిఅర్థము. ఈ గృహస్థాశ్రమములోనే స్వార్థపూరితమైన ప్రేమ తననుండి భార్యాబిడ్డలకు, అటుపైన తోటివారికి వారి పిల్లలకు విస్తరిల్లి విశ్వప్రేమ అలవడుట జరుగును. మరియు, పరంపరాగతముగావచ్చుచున్న "సంతతిక్రమము అను తంతువును అనగా దారమును త్రుంచవద్దు" అనుఅర్థములో ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః "అని చెప్పబడినది." నాగురువునుండి నేను వేదమును నేర్చుకొంటిని, నానుండి నీవు నేర్చుకొంటివి. ఇక ఇంతటితో అనగా నీతో ఈ వేదవిద్య అంతముకారాదు, నీనుండి నీశిష్యునికిగాని లేదా

పుత్రునకుగాని వేదవిద్య సంక్రమించవలెను. కావున నీవు అట్టి పుత్రుని పొందుటకై వివాహమాడి గృహస్థాశ్రమమును స్వీకరింపుము. మరియు, నీతాత వలన మీతండ్రికి శరీరమీయబడినది. నీతండ్రివలన నీకు శరీరమీయబడినది. ఇక ఇటుపై నీతో ఈ క్రమము ఆగక నీవలనకూడా ఇంకొకరికి పుత్రరూపములో శరీరమీయబడవలెను" అని దీనిఅర్థము. అనగా విద్యావ్యాప్తి క్రమమునకైనను. వంశాభివృద్ధిక్రమమునకైనను గృహస్థాశ్రమ స్వీకారముయొక్క ప్రాముఖ్యమును తెల్పునుద్దేశ్యముతో - పరంపరాగతముగా వచ్చుచున్న విద్యావ్యాప్తి తంతువునకును. ప్రజాతంతువునకును అవాంతరము రానీయవలదని చెప్పబడినది.

'సత్యాసత్య నిర్ణయములోను, ధర్మాధర్మ నిర్ణయములోను, ధర్మసాధనకై ఉపయోగపడుశరీరముయొక్క రక్షణవిషయములోను లోకశ్రేయస్సు మంగళకరమైన పనులను ఆచరించుటలోను, చదువుకొనుటకు. ఇతరులకు చెప్పుట అనువిషయములోను - ఏమాత్రము పొరపాటు రానీయకుము; అని ఆచార్యుడు చెప్పను, సత్యమును పలుకుట ధర్మమును ఆచరించుటలనుగూర్చి ఇంతకుపూర్వమే చెప్పబడినది. 'ఇతరులుచెప్పు విషయములలోని సత్యాసత్యములను, చేయు పనులలోని ధర్మాధర్మములను నిర్ణయించి తెలుసుకొనుటలో పొరపాటుపడకుము' అని ప్రస్తుతము చెప్పకొనవలెను. "శరీరమాద్యమ్ఖలు ధర్మసాధనమ్" అనగా "ధర్మసాధనమునకు శరీరము ముఖ్యముగదా లేదా ప్రథమముగదా" అని దీనిఅర్థము. "మంచి పనులుచేయుటకై అవసరమగు ఈ భౌతిక శరీరమును 'ఇది పాడు శరీరము, ఇది అశాశ్వతము' అను మెట్టవేదాంత వచనములు పలుకక అట్టి శరీరరక్షణకై, ఆరోగ్యవిషయమై ఎన్నడును ఏమరపాటుగాని.

పొరపాటుగాని రానీయకుము" అనిచెప్పబడినది. (ఈ మెట్టవేదాంత వచనములు చెప్పుటకు కూడ మరల ఈ నాలుకతో కూడిన శరీరమే కావలెను కదా!) ఏ విధమైన పనిచేసినను లోకహితార్థము, లోక కళ్యాణార్థము, చేయుమని చెప్పును." 'లోకము' అనునపుడు ఆ లోకములో పనిచేయువాడు గూడ కలిసియే ఉండును గాబట్టి లోక కళ్యాణము జరిగినపుడు పనిచేయువానికి, వాని కుటుంబమునకుకూడ మంచి జరుగును. (Individual is a part of the Universe, Therefore, if benefit is done to the Universe the individual will also be benefited) దీనినే యజ్ఞార్థ కర్మ అందురు. చదువుకొనుటలోను చదివినది ఇతరులకు చెప్పుటలోను పొరపాటు పడకుము' అని తరువాత చెప్పును. 'చదివినది ఒకటి, ఇతరులకు చెప్పునది మరియొకటి కారాదు. ఏ విధముగా ఆలోచించినను విష యములను వివరించుటలోగాని, వేదవిద్యను ఇంకొకరిచే చదివించు టలోగాని, తను ఆచరించునది ఇంకొకరిచే ఆచరింప చేయుటలో గాని ఏ మాత్రము తేడాలేకుండా చూచుకొనుము' అని దీని అర్థము. అనగా, తనకు, ఇతరులకు కూడ ఒకే రకమైన విద్య, ధర్మము, న్యాయము వర్తింపచేయవలెనని అర్థము చెప్పుకొనవచ్చును.

గృహస్థాశ్రమమునందు చేయవలసిన దేవసంబంధ కార్య ములు, పితృసంబంధ కార్యములు, చాల ఉండును. దేవకార్యము లనగా యజ్ఞయాగాది కర్మలు, పితృకర్మలనగా శ్రాద్ధాది కర్మలు. ఈ రెంటిని నియమబద్ధముగా శ్రద్ధతో చేయవలెనని చెప్పును. దేవ కార్యములు ఆచరించుటవలన తెలివి, బుద్ధి, ఓజస్సు, భ్రాజస్సు, సృజనాత్మకశక్తి పెంపొందును. పితృకర్మలవలన శౌచము, శారీరక దారుఢ్యము, వంశాభివృద్ధి మొదలైనవి పెంపొందును.

'మాతృదేవోభవ .... అతిథి దేవోభవ' అనుటలో తల్లి, తండ్రి గురువు అతిథి – వీరిని దైవములుగా భావించి, పూజించవలెనని నియమించబడినది. దైవములుగా భావించవలసిన వారిలో ఏ క్రమము పాటింపవలెనో కూడ తెలుపబడినది. ప్రప్రథమముగా తల్లిని దైవముగా పూజింపవలెను. అటుతరువాత తండ్రి, గురువు, అతిథి వచ్చుదురని ఇక్కడ చెప్పిన దానినిబట్టి గ్రహించవలెను.

"ఉపాధ్యాయాన్ దశాచార్య, అచార్యాణాం శతంపితా, సహ స్రంతు పితౄణ్ మాతా, గౌరవేణాఽతిరిచ్యతే" అనగా ఒక ఉపాధ్యాయునికిచ్చు గౌరవముకన్న 10 రెట్లు గౌరవము ఆచార్యునిపట్ల చూపవలెను. ఒక ఆచార్యునకిచ్చు గౌరవమునకు 100 రెట్లు ఎక్కువ గౌరవము తండ్రికి చూపవలెను. తండ్రికి ఇచ్చు గౌరవము కన్న 1000 రెట్లు ఎక్కువ గౌరవము తల్లిపట్ల చూపవలెను' అని ఈ శ్లోకము యొక్క భావము. ముందు చెప్పబడిన ప్రత్యక్ష దైవముల వరుసక్రమమును, ప్రాముఖ్యమును గూడ ఈ శ్లోకము తెలుపును. భారతదేశమున స్త్రీలకు అత్యున్నత స్థానము ఈయబడినదని ఈ క్రింది శ్లోకమును బట్టి తెలియును.

'యత్ర నార్యస్తు పూజ్యంతే - రమంతే తత్ర దేవతాః
యత్రైతాస్తు న పూజ్యంతే - సర్వాస్తత్రా
ఫలాః క్రియాః ॥

ఈ శ్లోకములో 'స్త్రీలు పూజింపబడినచోట లేదా గౌరవభావముతో చూడబడినచోట సకల దేవతలు సంతోషించి ప్రసన్నులగుదురు. తలపెట్టు కార్యములు సఫలములగును. స్త్రీలు ఎక్కడ గౌరవింపబడరో అక్కడ దేవతల యొక్క అనుగ్రహము లేక తల

పెట్టిన కార్యములన్నియు నిష్ఫలములగును' అని స్త్రీల ప్రాముఖ్యము చెప్పబడినది. స్త్రీలలో కూడ మాతృమూర్తికి ప్రథమస్థానము ఈయబడినది. జీవికి పుట్టుక నిచ్చినది. దేహము నిచ్చినది. పెంచినది కూడ తల్లియే. అట్టి తల్లిని ప్రథమ దైవముగా భావించుట సహేతుకము. కొడుకు సన్యాసమును స్వీకరించినపుడు అట్టి సన్యాసి కడకు తండ్రి వచ్చినపుడు ఆ సన్యాసిరూపములో నున్న కొడుకునకు తండ్రియే నమస్కరించవలెను. కాని, తల్లి వచ్చినపుడు ఆ తల్లికి సన్యాసి రూపములో నున్న కొడుకు నమస్కరించుట తప్పుకాదు. సన్యాసియైన శంకరాచార్యులవారు తల్లికి అపరకర్మలు చేసినసంగతి గుర్తుపెట్టుకొనవలెను. తల్లిని తిట్టువారు కలరు. అట్లు తిట్టుటకు కూడ తల్లి ఇచ్చిన శరీరములేనిదే వేరొక గతిలేదని మరువరాదు. దేవుడు లేడను సందేహము కలగవచ్చునేమోకాని 'తల్లి లేదనువాడు తానే వుండడు' అని గుర్తుంచుకొనవలెను. అందువలన తల్లి యొక్క ప్రాముఖ్యము ఈ విధముగా ముందు చెప్పబడినది.

దేహమునిచ్చి పోషించిన తల్లి తరువాత శరీర రక్షణ, విద్యాబుద్ధులు చెప్పించుట, క్రమశిక్షణలో పెట్టుట చేసిన తండ్రిని రెండవ ప్రత్యక్షదైవముగా భావించి, పూజించమని చెప్పబడినది. అటుపైన విద్యను చెప్పి, రెండవ జన్మను ప్రసాదించిన ఆచార్యుని మూడవ ప్రత్యక్ష దైవముగా భావించి పూజించమని చెప్పబడినది.' 'ఆచార్యుడు' అనగా ఉపాధ్యాయుడు మాత్రమే కాదు, ఉపాధ్యాయుడు క్రొత్త విషయములను తెలిపి, తెలియని విషయములను తేటపరచును. 'ప్రొఫెసర్' అను ఇంగ్లీషు పదమునకు 'ఆచార్య' దని అనువదించుచున్నారు. అది తప్పు ఆచార్యుడనగా తను చెప్పు

విషయములను ఆచరించువాడు. ప్రాథమిక విద్యాలయములోని ఉపాధ్యాయుడైనను అన్ని విషయములు తెలిసి, ఇతరులకు చెప్ప గలిగి, ఆ చెప్పిన వాటిని ఆచరించుచున్నచో ఆ ఉపాధ్యాయుడు గూడ ఆచార్యుడగును. నేటి విశ్వవిద్యాలయములలోని ప్రొఫెసర్లు చెప్పుదానికి ఆచరించుదానికి సంబంధము ఉండనివారే ఎక్కువ. నిజముగా అట్టి ప్రొఫెసర్లు చెప్పునది ఆచరించుటయే జరిగినపుడు వారు గూడ ఆచార్యుడను పదమునకు అర్హులు. ఆచరణ లేనివాడు ప్రొఫెసరు అవవచ్చునేమోగాని ఆచార్యుడని పిలిపించుకొనుటకు అనర్హుడు. అట్టి ఆచరణ పూర్వకమైన ఆచార్యుని చరణ కమల సేవనము చేయుమనుట చాల సముచితము, సమంజసము. మరియు, ఇట్టి ఆచార్యుని 'గురువు' అనుపదముతో గూడ పిలువవచ్చును.

'గు'కారో అంధకారస్తు, 'రు'కార స్తన్ని రోధకః ।
అంధకార నివృత్యాతు, గురు రిత్యభి ధీయతే ॥

పై శ్లోకము 'గురు' పదమునకు వివరణ తెల్పును. 'గురు' పదములోని "గు" కారము - గూడు కట్టుకొనిన అజ్ఞానాంధకారము నకు ప్రతీక ఐనచో "రు" కారము అట్టి అజ్ఞానాంధకారమును నిరోధించి, పారద్రోలి జ్ఞానప్రకాశవంతము చేయుటకు ప్రతీక అని, ఈ విధముగా 'గురు' పదమును గూర్చి అర్థము చేసికొనవలెనని ఈ శ్లోక సారాంశము. మరియు 'ఈ గురువే బ్రహ్మ, విష్ణు, మహేశ్వ రాత్మక స్వరూపము, సాక్షాత్తు పరబ్రహ్మ' అనికూడ భారతీయుల విశ్వాసము. అందుచేతనే —

'గురుర్బ్రహ్మ, గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్పర బ్రహ్మ, తస్మై శ్రీగురవేనమః ॥

అని గురు ప్రార్దనను చేయుదురు. ఒకవేళ మనము తప్పుపని చేసి నపుడు శివుడు కోపించినచో గురువు మనలను రక్షించుటకు అండగా నిలబడగలడు. కాని గురువే కోపించినచో ఇంక ఎవరు ఆదుకొన గలరు ?' అను అర్దములో —

'శివేరుష్టే గురుస్త్రాతా।
గురౌరుష్టే న కశ్చన ?,

అని అనుట కూడా గలదు. అందుచే ఆచార్యుని మూడవ ప్రత్యక్ష దైవముగా భావించి పూజించమని చెప్పబడినది.

భారతీయ సంప్రదాయములో అతిథి, అభ్యాగతులిద్దరును విష్ణుస్వరూపులే! అట్టివారిని దైవములుగా భావించి, పూజించమని ఇక్కడ చెప్పబడినది. 'భగవానుడే మనపై కరుణ కొలది మన ఇంటిలో ఆతిథ్యమును స్వీకరించి మనలను తరింపచేయుటకు అతిథి రూపములో వచ్చు' నని భారతీయుల నమ్మకము. అతిథికి భోజనము పెట్టుటవలన మన జన్మ చరితార్థము ఐనదని భావించవలెనుగాని, అతిథి మనకు ఋణపడినట్లు, కృతజ్ఞత తెలుపుకొనవలసిన అవసరము ఉన్నవానిగాను భావించరాదు. ఒకనికి అన్నము పెట్టినపుడు అన్నము పెట్టినట్లు గుర్తించుకొనరాదు. కాని, తిన్నవాడు ఆ విషయమును గుర్తించుకొనుట అతని సంస్కారమును తెలియజేయును.

ఎంత పెద్దవారైనను, ఎప్పుడైనను పొరపాటు చేయుట తటస్థింపవచ్చును. (To err is human) "ప్రమాదో ధీమతామపి" అనగా 'బుద్ధిమంతులు కూడ పొరపాటుపడుటకు, చేయుటకు అవకాశము కలదు' అని దీనిఅర్థము. అందుచే అట్టి పెద్దవారు చేసిన పనులు

కూడ నింద్యములే అగును. 'నింద్యములుకాని పనులనే నీవు చేయ వలెను. ఇతరములు అనగా నింద్యములైన వాటిని నీవు చేయరా దనియు, ఈ విషయములో ఆచార్యుడు చేసిన పనులలో మంచి వాటినే చేయుమనియు, ఆచార్యుడైనను పొరపాటున చేయకూడని పనులు చేసినచో అటువంటి వాటిని చేయరాదనియు ఆచార్యుడే మొహమాటపడకుండ శిష్యునకు ఇక్కడ చెప్పుచున్నాడు.

ఎప్పుడైనను మన ఇంటికి మనకంటెను, మన ఆచార్యుని కంటెను శ్రేష్ఠమైన బ్రాహ్మణుడు వచ్చినపుడు - ముందుగా నమ్రతతో గౌరవ పూర్వకముగా, కూర్చున్న ఆసనమునుండి లేచి, ఎదురేగి, తోడ్కొని వచ్చి, ఆసనములో కూర్చుండ జేసి, ఆయన బడలిక తీరుటకు తగిన సపర్యలు చేయవలెను. అట్టి ఉత్తములకు ఏదైన సమర్పించవలెనని బుద్ధి కలిగినపుడు కడు శ్రద్ధా భక్తులతో సమ ర్పించవలెను. అశ్రద్ధ – అవిధేయతను, ఉదాసీనతను, నిర్లక్ష్య భావమును, వైముఖ్యమును, పదవీ అధికార మదాంధత్వమును తెలియజేయును. అందుచేతనే, "అశ్రద్ధయా అదేయమ్" అని చెప్ప బడినది. మనకున్న సంపదనుబట్టి, ఐశ్వర్యమును బట్టి సమర్పించ వలెను. అంతేగాని శ్రీమంతులుగూడా తక్కువ ధనము కల్గినవారు సమర్పించినట్లుగా సమర్పించరాదు. అనగా 'మన తాహతును బట్టి సమర్పించవలెను' అని అర్థము వచ్చుటకు "శ్రియాదేయమ్" అని చెప్పబడినది. ఇట్లు సమర్పించునపుడు – "నేను ఇంతే ఇచ్చు చున్నాను", అని సిగ్గుపడుచు, 'భగవంతుడు నాకు ఎక్కువ సంప దను అనుగ్రహించి ఉండినచో ఎక్కువ సమర్పించగల్గివుండెడి వాడనుగదా' అని బిడియపడుచు సమర్పించవలెనను అర్థములో "హ్రియాదేయమ్, భియాదేయమ్" – అని చెప్పబడినది. మరియు

చిట్టచివరకు ఇచ్చేడిదెవరికో, అది ఏ విధముగా సద్వినియోగపడునో తెలుసుకొని సమర్పించుమను ఉద్దేశ్యముతో "సంవిదా దేయమ్" అని చెప్పబడినది.

ఎన్ని శాస్త్రములు చదివినను, ఎంతమంచి పెద్దల ప్రసంగములు విన్నను, ఒక్కొక్కప్పుడు కర్మ విచికిత్స, అనగా – కర్మను గూర్చిన సందేహముగాని, వృత్తి విచికిత్స, అనగా – ప్రవర్తన ఆచారముల విషయములో సందేహముగాని రావచ్చును. అట్టి సందర్భములో కర్తవ్య నిర్వహణకు ఏమి చేయవలెనో ఇటుపై తెలుపుచున్నాడు. చక్కగా విమర్శించి, విడమరచి, యుక్తమైన రీతిలో చెప్పగల సమర్థులును, ఇంకొకరు చెప్పకయే మంచిపనులు ఆచరించువారును, క్రూర స్వభావము లేనివారును, ధర్మమునందు ఆదరాభిమానములు కలవారును ఐన బ్రాహ్మణులు నీకు అందుబాటులో వున్నచో వారు నీవు సందేహపడు విషయములలో లేదా సందర్భములలో ఏ విధముగా ఆచరించి, ప్రవర్తించుదురో నీవును ఆ విధముగా చేయుమని గురువు శిష్యునకు చెప్పను. ఇక్కడ అట్టిపెద్దలకు వాడిన విశేషములు చాల అవసరమైనవి. ఎంతో దూరములోనున్న పెద్దలనే ఆశ్రయించవలసిన పనిలేదు. అట్టి ప్రవర్తనాదులు కల్గిన వారు దగ్గరలో అందుబాటులో ఉన్నచో వారినైనను అడగవచ్చును. వారు స్వయం ప్రేరణచేతనే మంచిపనులు చేయువారుగా ఉండవలెను. క్రూరస్వభావమున్నచో - కోపము, క్రోధము కలిగి, ధర్మ నిర్ణయమునకు అజ్ఞానపు పొర అడ్డువచ్చును. మరియు, వ్యక్తిగతమైన శత్రుభావమున్నపుడు కూడ ప్రతీకార వాంఛతో అధర్మమును చెప్పుట కూడ జరుగును. అందుచేతనే 'ధర్మమునందు ఆదరము కల్గినవాడుమాత్రమే' అను విశేషణము వేయబడినది. మరియు, ఒక్కొ

క్కప్పుడు దోషులని సంశయింపబడుచున్న వారి విషయములో కూడ ఏమి చేయవలెనను సందేహము రావచ్చును. అప్పుడు కూడ ఇంతకు పూర్వము చెప్పిన లక్షణములన్నియు కల్గిన బ్రాహ్మణులు — వారి పట్ల ఏ నిర్ణయము తీసుకుందురో అదేవిధమైన నిర్ణయమును తీసుకొనుమని చెప్పును. అనగా 'చెప్పబడిన సల్లక్షణములు కలిగిన పెద్దల సలహాలు, నిర్ణయములు నీకు ఎల్లప్పుడును సన్మార్గమును చూపుటకు దోహదపడుగాక! నీవును అట్టివారి నిర్ణయమును స్వీకరించుటలో వెనుకాడక, మొహమాటపడకుందువుగాక!' అని దీని అర్థము.

'ఇంతవరకు నేను చెప్పినదంతయు నా ఆదేశముగా అనగా ఆజ్ఞగా (order) తీసుకొనుము' అని గురుభావముతో చెప్పి, "ఒక వేళ నీకు - విద్యనంతయు నేర్చిన తరువాత 'నన్ను ఇంకొకరు ఆజ్ఞాపించుటయా' అను భావము కలిగినచో నేను చెప్పినదానిని ఉపదేశముగా అనగా సలహాగా తీసుకొనుము." (if you feel that it is too much to receive the order from me,[take what all I have said as suggestion) అని చాల మెత్తగా శిష్యుని యొక్క మంచిని కోరి చెప్పు అర్థములో "ఏష ఆదేశః। ఏష ఉపదేశః"అను వాక్యములు విచిత్రమైన పద్ధతిలో ఈ సున్నితమైన ఉపనిషత్ మార్గములో చెప్పబడినవి. చిట్టచివరకు 'నేను ఇంతవరకు చెప్పినదంతయు వేదముల యొక్క సారాంశము. ఈ విధముగానే చేయుట, ఉపాసించుట మంచిది" అని శిష్యుని వాత్సల్యపూర్వకముగా వెన్ను తట్టి, భావి జీవితాశ్రయమైన గృహస్థాశ్రమమునకు పంపుట జరుగును.

ఈ అనుశాసనములో – 'మెట్ట వేదాంత విషయముగాక, ఆచరణ పూర్వకమైన, ఉపాసించదగిన విషయములను గురువు శిష్యునకు చెప్పు' నను మిషతో (నెపముతో) అందరికిని దైనందిన జీవితములో ఉపయోగపడు విషయములు ఈ అనువాకములో చెప్పబడినవి.



శ్రుతిగీత - 2

(Vedic Verdict on Food and Accommodation)

వ్యాఖ్యానము

డా॥ జి. ఎల్. ఎన్. శాస్త్రి, M. Sc., M.Phil, Ph.D.
Reader & Head of the Department of Physics,
T. J. P. S. College, Guntur.



జగద్గురు పీఠము - గుంటూరు శాఖ
(THE WORLD TEACHER TRUST - GUNTUR BRANCH)
గుంటూరు - 522 002

ముందు మాట

శరీరధారులైన జీవులు భౌతికలోకము (Material plane) నకు చెందినవారు, నీరు నీటియావిరిస్థితిలో నున్నప్పటికంటె ఘనస్థితిలోని మంచుగడ్డగా నున్నపుడు ఒక పరిమాణము నకు, ఒక ఆకారమునకు కట్టుబడి వుండవలసిన ప్రతిబంధక ములు ఏవిధముగా తప్పవో- జీవి శరీరధారియై యున్నపుడు ఆకలిదప్పులు, శారీరిక బాధలు ఆవిధముగానే తప్పవు. భౌతికమైనశరీరములోనున్నంతవరకు వీటిని భౌతికరూపముల లోనే తీర్చుకొనక తప్పదు.

కృశించి,నశించిపోవు ఈ పాడుశరీరమును గురించిన, అది నిలబడుటకు గ్రహించు అన్నమును గురించిన విషయ ములు మెట్టవేదాంతులకు అప్రధానముగాతోచవచ్చునేమో గాని నిజమైన వేదాంతులకు ప్రధానమైనవే! "శరీరం మే విచర్షణమ్" అన్నది ఉపనిషద్వాక్యమేగదా! శరీరరక్షణకు, పోషణకు గల ప్రాముఖ్యమును ఈ శ్రుతివాక్యము తెల్పును. [మెట్టవేదాంతులు- 'పాడుశరీరం, ఇది కట్టె', అని చెప్పు టకు గూడా అటువంటి శరీరములో నుండియే చెప్పవలెను తప్ప వేరొక గతిలేదని గుర్తుంచుకొనవలెను! 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్' ఏ విధమైన సత్కార్య, ధర్మకార్య

విద్యార్జనకైనను, సమాజసేవకైనను ఈ శరీరము ముందు ముఖ్యమని గుర్తించుకొనవలెను.

అన్నమును స్వీకరించుటలో మిగిలినజీవులకు మానవులకు భేదము ఉండును. పశువు తన ఆహారమును నేలమీద నుండి నేరుగా నోటిలోనికి గ్రహించును. ఆ విధముగా స్వీకరించు ఆహారమును 'అన్నము'అనుటకుబదులు'గ్రాసము' అనుట సముచితము. తినబోవు ఆహారమును శుచిగా ఒక నిర్దుష్టమైన పద్ధతిలో తయారుచేసి ఒక పాత్రయందుగాని పత్రము నందుగాని ఉంచి స్వీకరించునది మానవుడొక్కడే! ఈ రెండు పద్ధతులకు గల భేదమును'సంస్కారము'అందురు. (ఇది అరుగుటకు సంబంధించిన విషయముకాదు). ఆహార స్వీకరణ (Diet), విశ్రాంతి (Rest), నిద్ర (Sleep) - ఈ మూడు విషయములలో మనము కొన్ని నియమ, నిబంధనలను పాటించినచో- మందులతో అవసరములేకయే మన ఆరోగ్యమును మనమే కాపాడుకొనవచ్చును. నేడు మనము తినిన ఆహారము రేపటి మన మానసిక, దేహస్థితులను తెలియచేయును. (Today's Food is tomorrow's mind and health). మనకు ప్రస్తుతము వచ్చిన త్రేనుపు (Belching) ను బట్టి ఇంతకు పూర్వము మనము తినిన ఆహారమును చెప్పవచ్చును. నేడు మితిమీరితిన్నచో రేపు శరీరము

గతిమారి ప్రవర్తించును. ఈ విధముగా శుభారోగ్యమునకు మనము తినెడి ఆహారము కారకమైనపుడు దానిని ఎట్లు తినవలెను? ఎట్లు తినరాదు? ఆ అన్నమునకు సంబంధించిన నియమ నిబంధనలేమైన వున్నవా!- మొదలగు విషయములు ఈ చిన్న పుస్తకమునందు వివరింపబడినవి.

'ఎప్పుడు ఏది ఎలా జరగవలెనో అప్పుడు అది జరుగును, అంతయు వానిలీల' అని చెప్పి కొందరు సోమరి తనముతో, అలసత్వముతో చేయవలసిన పనులను, పురుష ప్రయత్నములను చేయక తప్పించుకొనుచుందురు. వీరు చెప్పినది నిజమైన వేదాంతముగాదు, కర్మసిద్ధాంతముకాదు. అదియే నిజమైనచో ఒక తేలు తమ వైపునకు వచ్చునపుడు వారు అక్కడనే నిలబడరు. ప్రక్కకు తప్పుకొని పురుష ప్రయత్నమును చేయుదురు. వీరు చెప్పునదియే నిజమైనచో- సూక్తులు, నీతిశాస్త్రము, ధర్మశాస్త్రము, పెద్దల హితబోధలు, అనుభవములు ఇవిఅన్నియు అనవసరమై ఉండెడివి గదా! 'కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన' 'ఫలితములపై దృష్టిని ఉంచకుండా, విధ్యుక్తమైన, బాధ్యతాయుతమైన కర్మలను చేయుము' అనునదియే భగవానుని గీతా వాక్యసారాంశముగాని, 'కర్మలు చేయవలసిన పనిలేదని'గాదు. ఇట్టి కర్మసిద్ధాంత సూక్ష్మవిషయములు, వసతికిసంబంధించిన

మరికొన్ని ధర్మసూక్ష్మ విషయములు గూడ ఈ చిన్న పుస్తకమునందు వివరింపబడినవి.

ఈ చిన్న పుస్తకమునందు వివరింపబడిన విషయములన్నియు నేను లోగడ వివరించి, ప్రచురించిన 'తైత్తిరీయోపనిషత్తు' గ్రంథములోనివే! 'అయినచో మరల వేరొక పుస్తకముగా ప్రచురించుట ఎందులకు?' అను సందేహము రావచ్చును. గజేంద్రమోక్షణము, రుక్మిణీకళ్యాణము, అజామిళోపాఖ్యానము, ప్రహ్లాదచరిత్ర, వామనచరిత్ర మొదలగునవన్నియు 'భాగవతము' లోనివే! అయినప్పటికినీ వీటిని విడివిడిగా చిన్నచిన్న పుస్తకములలో వేర్వేరుగా ప్రచురించుట ఎందులకు ? అను ప్రశ్నకు ఏది సమాధానమగునో ఈ సందేహమునకును అదియే సమాధానమగును. (పెద్దగ్రంథములో ఉన్నపుడు ఈ విషయములు పాఠకుని దృష్టికి కనుమరుగైపోవు అవకాశము ఉండవచ్చును. ఇట్టి పరిస్థితి కలుగకుండా వుంచుటకు ముఖ్యమైన విషయవివరణలను వేరుగా చిన్న పుస్తకములలో ప్రచురించుట పరిపాటి. ఈ ఒక్క విషయమునకేయైనచో పెద్ద గ్రంథమును కొనవలసిన అవసరము కూడా తప్పునుగదా!) నేను ఇంతకు పూర్వము తైత్తిరీయోపనిషత్తులోని శిక్షావల్లి యందలి చివరి అనుశాసన అనువాకము (Convocation Address) ను వివరించి 'శ్రుతిశిక్ష-1' అని ప్రచురించుట జరిగినది. ఇందు విద్యలన్నియు

నేర్పిన పిదప ఆచార్యుడు- సమాజములో అడుగుపెట్టబోవు తన విద్యార్థికి సూచించు, ఉపదేశించు విషయములుండును. ఇవి అత్యంత ఉపయోగకరమైనవి.

'శ్రుతిగీత-1' పుస్తకము నందలి విషయము లెంత ఉపయోగకరమైనవో ఈ ప్రస్తుత 'శ్రుతిగీత-3' పుస్తకము నందలి విషయములు గూడ అంతఉపయోగకరమైనవే! నేను వివరించిన 'తైత్తిరీయోపనిషత్తు' అను గ్రంథమునందలి ఈ విషయములను శ్రీ కొండా శివరామకృష్ణమూర్తిగారు శ్రద్ధగా. ఆసక్తితో మరలమరల చదివిన తరువాత 'అన్నము నకు' వసతికి, కర్మసిద్ధాంతమునకు సంబంధించిన ఈ విషయ ములు అత్యంత విలువైనవని, వీటిని వేరుగా ఒక పుస్తక ములో ప్రచురించినచో చాలామందికి ఉపయోగకరముగా నుండునని ప్రతిపాదించి, అందులకగు ఖర్చును గూడా తాను భరించుదునని చెప్పి ముందుకువచ్చిరి. విషయము వచ్చినదని, ఉపయోగకరమైనదని ప్రశంసించుట అందరును చేయుదురు. స్తోమత ఉన్నవారిలో, ఒక జీవిత లక్ష్యము, ఆదర్శము గలిగినవారిలో కొందరు ఆ విధముగా ప్రశం సించుటతోనే ఊరుకొనరు శ్రీ K. శివరామకృష్ణమూర్తి గారు ఈ రెండవకోవకు చెందినవారు. ఇంతకుపూర్వము గూడా వారు జగద్గురుపీఠము గుంటూరు శాఖ వారు మాస్టర్ E. K. గారి అనుగ్రహ, ఆశీస్సులతో నిర్వ

హించు వైద్యసేవా, ఆధ్యాత్మిక గ్రంథ ప్రచురణా కార్య క్రమములకు ముచ్చటపడి వైద్యాలయ నిర్వహణార్థము, "శ్రీలామాంఛనమ్" అను ఒక పుస్తక ప్రచురణార్థము, గురు పూజా కార్యక్రమనిర్వహణార్థము వేరు వేరుగావిరాళములిచ్చి కార్యకర్తలను ప్రోత్సహించిరి. వీరు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యోత్తర కార్యదర్శిగా ఈ మధ్యనే పదవీ విరమణ చేసిరి. వీరుకూడా మాస్టరు E. K. గారి శిష్యులే! మాస్టరుగారిపట్ల తన కృతజ్ఞతా భావమును గురు దక్షిణారూపములో తెలుపుకొనుటకు ఈ విధముగా సత్కార్యములకు విరాళములనిచ్చుట చక్కని అవకాశమని తృప్తిగా చెప్పి, ఆనందముతో వారు ఈ విరాళముల నిచ్చిరి. ఉద్యోగిగా నున్నపుడుకూడ ఆధ్యాత్మికచింతనగల సహో ద్యోగులను,మిత్రులనుసమీకరించి'అమృతవాహిని'అనుపేర ఒక ఆధ్యాత్మిక మిత్రమండలిని స్థాపించి ఆధ్యాత్మిక కథా మంజరిగా 'గాథాలహరి' అనుపేర ఒక పుస్తకమును కూడా ప్రచురింపజేసిరి.

మాస్టర్ E. K. గారికి సంబంధించిన సేవా కార్య క్రమములకు తన సహాయసహకారముల నందించుటకు ఎప్పుడూ తాను సిద్ధముగా నున్నానని చెప్పి— తనగురువుకు, గురువు చూపిన మార్గమునకు తనను అంకితము చేసుకొనిన

శ్రీ K.శివరామకృష్ణమూర్తిగారికి నాతరఫున, మా సంగమ పీఠము- గుంటూరుశాఖవారి తరఫున కృతజ్ఞతాపూర్వక ధన్యవాదములు తెలుపుతూ వారికి వారి సహధర్మచారిణి శ్రీమతి రాజ్యలక్ష్మీదేవికి, వారి యావన్మంది కుటుంబ సభ్యులకు సుస్థిర ఆయురారోగ్యైశ్వర్యములను భగవంతుడు ప్రసాదించవలెనని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తకమును ముద్రించి ఇచ్చిన శ్రీ లక్ష్మీగణపతి ముద్రణాలయమువారికి కృతజ్ఞలు తెల్పుకుంటున్నాను.

యువ, పుష్యపూర్ణిమ
5-1-1996

—జి. ఎల్. ఎన్. శాస్త్రి



స్పందన

బ్రహ్మశ్రీ G.L.N. శాస్త్రిగారి తైత్తిరీయోపనిషత్ వ్యాఖ్యానమును శ్రద్ధగా చదివిన తరువాత అలాంటి శాస్త్రీయ వివరణము ఈ మానవాళికి నిత్యజీవితమున ఎంతో మేలుచేయగలదని భావించాను. అన్నమును నిందింపరాదు, కోపము, అసూయ, ద్వేషములతో భుజించ రాదు. అనువిషయములు ఈ తైత్తిరీయోపనిషత్ చివరిలో భృగువల్లియందు నిక్షిప్తమైయున్నవి. ఉపనిషత్తులు వల్లె వేయుటకన్న, వాటి అర్థమును తెలుసుకుని, మన నిత్యజీవిత మునకు అన్వయించుకుని, మనము సుఖపడుటకే ఈ మానవాళికి ప్రసాదించబడినవి. గురుదేవులు శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులవారు శ్రీ G.L.N. శాస్త్రిగారి హృదయమున నిలచి తద్వారా మనకు ఈ వివరణ యిచ్చా రని, ఇది మనలను కలి ప్రభావం నుంచి రక్షించగలదని నాకుతోచినది. ప్రతిరోజు మనం భోజనం చేసేటప్పుడు కోపతాపాదులకు గురిఅగుట మనందరికి తెలిసిన విషయమే. దానివలన అన్నవాహికలో Acidity ఉద్భవించి, విష తుల్యమైన, Deodenumulcers, Peptic ulcers తద్వారా Cancer మొదలగు వ్యాధులకు గురి అగుచున్నాము. ఈ విషయమును మన Master E. K. గారు వారి ఉపన్యాసము

లలో తరచుగా మనకు చెబుతుండేవారు. ఈ గ్రంథములో చెప్పిన విధానము నాచరించినచో మనము తిను ఆహారము అమృతతుల్యమగును. దేహమునకు వంటపట్టి ఆరోగ్యవంతులగుటకు అవకాశము గలదు. ఈ విషయము అందరికి తెలిపి ఆచరణద్వారా అందరుఆరోగ్యవంతులవాలని నామనస్సునకు అనిపించినది. వెంటనే శ్రీ G.L.N. శాస్త్రిగారిని ఈఅన్నము అను Subject ను ప్రత్యేకముగా ముద్రించినచో అందరకు ఉపయోగపడునని కోరగా వారు అనుగ్రహించి అనుమతించిరి. Master E. K. గారే వారి హృదయాంతర్వర్తియై మనకు ప్రసాదించిన ఈ వివరణ మనమందరము ఆచరించి ఆరోగ్యవంతులమై యుండాలని ఈ పుస్తకమును అచ్చువేయించుచున్నాను. నా గురుదేవులు Master E. K. గారి పాదపద్మములకు ఇది ఒక చిన్న పూజాపుష్పము. శ్రీ G.L.N. శాస్త్రిగారు ఈ సమాజానికి మరెన్నో ఇలాంటివి ప్రసాదించాలని కోరుకుంటున్నాను.

ఇట్లు

బుధజనవిధేయుడు

కొండా శివరామకృష్ణమూర్తి



శ్రుతిగీత - 2

మంత్రము :

అన్నం న నిన్ద్యాత్ । తద్వ్రతమ్। ప్రాణో వా అన్నమ్॥

శరీర మన్నాదమ్। ప్రాణే శరీరం ప్రతిష్ఠితమ్। శరీరే ప్రాణః

ప్రతిష్ఠితః । త దేత దన్నమన్నే ప్రతిష్ఠితమ్। సయ ఏత

దన్న మన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవా

నన్నాదో భవతి । మహాన్భవతి ప్రజయా పశుభి ర్బ్రహ్మవర్చ

సేన । మహాన్కీర్త్యా।

టీక:- అన్నమ్ = అన్నమును, న నిన్ద్యాత్ = నిందించవద్దు, తత్ = అది, వ్రతమ్ = వ్రతమువంటిది, ప్రాణః వా అన్నమ్ = ప్రాణమే అన్నము, శరీరమన్నాదమ్ = శరీరము అన్నాదము, ప్రాణే = ప్రాణమునందు, శరీరమ్ = శరీరము, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠింపబడి ఉన్నది,

శరీరే = శరీరమునందు, ప్రాణః = ప్రాణము, ప్రతిష్ఠితః = ప్రతిష్ఠితమై ఉన్నది (లేదా కూర్చబడి ఉన్నది), తత్ = అందువలన, ఏతత్ = ఈ ప్రాణ, శరీరములజంట, అన్నే = అన్నమునందు, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠితమగుచున్నది, యః = ఎవ్వడు, ఏతత్ = ఈ జంటను, అన్నే = అన్నమునందు, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠితమైనదని, వేద = తెలుసుకొనుచున్నాడో, సః = వాడు, ప్రతితిష్ఠతి = ప్రతిష్ఠితుడగుచున్నాడు, అన్నవాన్ = అన్నమును కలిగినవాడు, అన్నాదః = అన్నమును పొందువాడును, ఇచ్చువాడును, ప్రజయా = పుత్రపౌత్రాదికముచేత, పశుభిః = పశుసంపదచేత, బ్రహ్మవర్చసేన = బ్రహ్మవర్చస్సుచేత, మహాన్ = మహనీయుడై, కీర్త్యా = కీర్తిచేత, భవతి=అగుచున్నాడు.

తాత్పర్యము :- అన్నమును నిందించకూడదు, ఈ నియమమును వ్రతముగా పాటించవలెను. ప్రాణమే-అన్నము. శరీరమే-అన్నాదము, ప్రాణమునందు-శరీరము, శరీరమునందు-ప్రాణము ప్రతిష్ఠితమై ఉన్నవి. అందుచే ఈ ప్రాణ శరీరములు అన్నమునందు ప్రతిష్ఠితమగుచున్నవిగా తెలుసుకొనువాడు కూడ ప్రతిష్ఠితుడగును. అంతేగాదు, అన్నమును కల్గినవాడు, అన్నమును ఇచ్చువాడు, అన్నమును పొందువాడుగా కూడ అగును. మరియు, చక్కని సంతానముచేత,

పుష్కలమైన పశుసంపదచేత, స్వచ్ఛమైన వర్చస్సుచేత, కీర్తి చేత మహనీయుడగును.

వివరణము :- ఈ అనువాకములో మనము తినెడి అన్నముపట్ల మనము పాటించవలసిన సాధనా రహస్య ములలో ఒక రహస్యము చెప్పబడుచున్నది. 'అన్నమును నిందించకూడదు' అనునది మొదటి రహస్యము. భృగువు బ్రహ్మజ్ఞానమును పొందుట తపస్సు ద్వారా సాధించెను. ఈ తపస్సుచేయుటకు పంచభూతాత్మకమైన శరీరముఉండవలెను. ఈ శరీరము అన్నముచే తయారైనది. మరియు బ్రహ్మ జ్ఞానమును పొందుటలో తొలిమెట్టుఐన అన్నమయకోశము భృగువునకు మొదట గురువుగా పనిచేసెను. అందుచే గురువును ఎట్లు నిందించకూడదో అన్నమునుగూడా అట్లు నిందించకూడదు.'అన్నంననిన్ద్యాత్' అనుదానికి అన్నమును నిందించరాదని, నిందించుచూ అన్నమును భుజించరాదని రెండు విధములైన అర్థములు చెప్పుకొనవలెను. అనగాచేసిన పదార్థములలో కొంచెము ఉప్పు, కారములలో-తేడాఉండి, రుచి తగ్గినను-వాటిని, వాటిని చేసిన వారిని తిట్టరాదు. తనకు నచ్చనిచో-నచ్చినదానిని తినవలెనేగాని,నచ్చనిదానిని తిట్టరాదు. అన్నమును తినుటకుముందు ఎవరిపైనైన కోపము గాని, అసూయ, ద్వేషాదులుగాని వున్నచో - అన్నమును తినునపుడు వారుగాని, వారి సంబంధమైన సన్నివేశములు

గాని గుర్తువచ్చి కోపముతో తిట్టుకొనుచూ భోజనము చేయరాదు. అప్పుడు భోజనముతోపాటు తిట్లనుగూడా తినినట్లగును. ఆ తిట్లు అసూయవలన. ద్వేషమువలన పుట్టినవిగాబట్టి, అన్నముతినుటవలన తాను ఎట్లు పెరుగునో - ఆ తిట్లనుతినుటవలన ఆ అసూయాద్వేషాదులుకూడా తనలో అట్లు పెరుగును. కొందరు వస్త్రాదులు తాముతినబోవు రొట్టెలను - పిండిని తయారుచేయునప్పటి నుండి ఎంతో శ్రద్ధతో 'ఇదేగదా మనబలమునకు కారణము' అను దృష్టితో వాటిని తయారుచేసి తిందురు. ఆ సమయములో అవాంఛనీయమైన ఏ విషయములు వారి మనస్సులలో ఉండవు, అందువలననే వారికి ఆ విధముగా తిన్న ఆహారము పూర్తిగా వంటబట్టును.

ఇక్కడ మరియొక విషయమును గూడ చెప్పుకొనవలెను. మనము అన్న పానీయాదులను తీసికొనువిధానము, అప్పటి పరిస్థితులు గూడ మనపై ప్రభావమును చూపును. తల్లి పానీయమును ఇచ్చినపుడు త్రాగుదుము. అట్లే, స్నేహితుడు ఇచ్చినపుడు త్రాగుదము. అట్లే, బట్టలషాపులో షాపు యజమాని ఇచ్చినపుడు గూడ త్రాగుదుము. కాని, ఈ మూడు పరిస్థితులలో మనము త్రాగిన పానీయములకు చాల భేదము ఉండును. షాపుయజమాని మన పెరుగుదలను,

ఆరోగ్యమును కాంక్షించి పానీయమును ఈయదు. తరువాత మనము కొనిన బట్టలకు బిల్లు వేయునప్పుడు ఈ పానీయము నకగు ఖర్చును కూడ కలిపి వేయను. అట్లే, స్నేహితుడు అతిథి మర్యాదలను (Hospitality and formalities)దృష్టిలో పెట్టుకొని మనకు పానీయములను ఇచ్చును. కాని, షాపు యజమాని ఇచ్చునదానికన్న నయమే! ఈ రెంటికిపూర్తిగా భిన్నముగా తల్లి ఇచ్చిన పానీయము-మన పెరుగుదలను, ఆరోగ్యమును ఆకాంక్షించి ఉండును. అట్లే, మనము హోటలులో మరికొంచెము అన్నము ఎక్కువతినుచున్న పుడు సర్వరు, హోటలు యజమాని గూడ ఏదో తాము నష్టపోవుచున్నట్లు బాధవారిలో అంతర్లీనమై వుండును. కాని, తల్లి ప్రేమతో ఆహారమును పెట్టునపుడు మనము ఎంత తిన్నచో అంత సంతోషించును. ఆ విధముగా తినిన అన్నము-మనకు వంటబట్టుటయేగాక తినుచున్నపుడు తల్లి చూపు అపేక్ష, ప్రేమ, అనురాగములనుగూడ మనలో పెంపొందింపజేయును.అందుచే, అన్నమునుతినువిషయములో దానిని తీసుకొను విధాన, పరిస్థితుల ప్రభావము మనపై ఉండునని గ్రహించవలెను.

‘అన్నమును నిందించరాదు.’ అను నియమమును వ్రతముగా పాటింపవలెనని నిర్ధారింపబడినది. వ్రతము,నోము

మొదలైన విషయములుగా చెప్పినప్పుడు ఎక్కువ శ్రద్ధా భక్తులతో నియమము పాటింపబడును. భారతీయ సంప్రదాయములో ఆచారకాండ వెనుక ఉన్న శాస్త్రీయత అంతయు ఈ వ్రతనియమాది అనుష్ఠానపూర్వకముగానే చెప్పబడినది. "పూజయేత్ అశనం నిత్యం" అనియు, "పూజితం అశనం నిత్యం, బలమూర్జం చ యచ్ఛతి। అపూజితంతు తదుభ్యక్తమ్, తదుభయోర్నాశయేదిదమ్।" అనగా, 'అన్నమును నిత్యము పూజింపుము. అట్లు పూజింపబడిన అన్నము శరీరమునకు బలమును, శక్తిని తేజస్సును ఇచ్చును. పూజించని అన్నము అనగా అగౌరవభావముతో చూడబడిన అన్నము ఎంత తిన్నను శక్తి, బలము, వర్చస్సుల నీయదు' అని పెద్దలు చెప్పిరి.

శరీరముకన్న ప్రాణముగొప్పదని, అన్నముకన్న ప్రాణము గొప్పదని అభిప్రాయపడుట సరిగాదు. 'ప్రాణమే-అన్నము,' మరియు, 'శరీరమే-అన్నాదము' అగుట వలన ప్రాణ, శరీరములు ఈ అన్నము ద్వారా సంధానింపబడుచున్నవి. అనగా ఈ శరీరము అన్నమును తినును. ప్రాణమునందు శరీరము స్థాపింపబడి ఉండును. అందుచే ప్రాణమును శరీరమునుండి వేరుగా అర్థము చేసుకొనుట పొరపాటు. ఈ జంట-అన్నముతో సంధానింపబడి అన్నమునందు ప్రతిష్ఠింపబడుచున్నదని తెలిసికొనినవాడు తాను

కూడా అదేవిధముగా ప్రతిష్ఠితుడగును. 'తిష్ఠ' అనగా స్థిరత్వమును పొందినస్థితి. 'ప్రతిష్ఠిత' అనగా చక్కగా స్థిరత్వమును పొందిన స్థితి. ప్రాణ, శరీరముల మధ్య సంబంధము ఎంత స్థిరముగా చెక్కుచెదరకవుండునో - తానుకూడ అంత చెక్కుచెదరని వానిగా వుండునని దీని అర్థము. ఇట్టివాడు అన్నమును కలిగినవాడు, గ్రహించువాడు, ఇచ్చువాడు అగుచు, అందఱి హృదయములను స్పృశించిన వాడగుటచే దయా, దాక్షిణ్య, సేవా, ఆపేక్షలు కలిగినవాడై - చక్కని సంతానముచేత, గో, వృషభాది పశుసంపదచేత, చక్కని వర్చస్సుతో మహనీయుడై కీర్తిమంతుడగును. 'అన్నమును నిందించకుండుట' అను నియమమును ఆచరణలో పెట్టువానికి ఈ చెప్పబడిన ఫలితములు దక్కును. ఇటుపైన మరియొక నియమమును గూర్చి చెప్పబడును.

అన్నం న పరిచక్షీత। తద్వ్రతమ్ । ఆపో వా అన్నమ్ ।

జ్యోతి రన్నాదమ్ । అప్సుజ్యోతిః ప్రతిష్ఠితమ్।జ్యోతిష్యాపః

ప్రతిష్ఠితాః । త దేత దన్న మన్నే ప్రతిష్ఠితమ్ । స య ఏత

దన్న మన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవా నన్నాదో

భవతి । మహాన్భవతిప్రజయా పశుభి ర్బ్రహ్మవర్చసేన। మహా

న్కీర్త్యా ॥

టీక :- అన్నం = అన్నమును, న పరిచక్షీత = పారవేయతగదు, తత్ = అది, వ్రతమ్ = వ్రతము, ఆపః = ఉదకములు, అన్నం వై = అన్నము కదా, జ్యోతిః = జ్యోతిస్సు, అన్నాదమ్ = అన్నాదము, అప్సు = జలములందు, జ్యోతిః = జ్యోతిస్సు, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠితమగుచున్నది, జ్యోతిషి = జ్యోతిస్సునందు, ఆపః = ఉదకములు, ప్రతిష్ఠితాః = ప్రతిష్ఠితములై ఉన్నవి, తత్ = అందువలన, ఏతత్ = ఈ (జ్యోతిస్సు, ఆపస్సుల) జంట, అన్నే = అన్నమునందు, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠితమగుచున్నది, (మిగిలిన పదములకు పూర్వానువాకమునందు అర్థములీయబడినవి).

తాత్పర్యము :- 'అన్నమును పారవేయవలదు'. ఈ నియమమును వ్రతముగా పాటింపవలయును. ఉదకములే- అన్నము. జ్యోతిస్సు - అన్నాదము. అన్నాదమనగా -

అన్నమును తినునది. జలములందు- జ్యోతిస్సు అనగా అగ్ని, అగ్నియందు- జలములు ప్రతిష్ఠితములై ఉన్నవి. ఈ అగ్ని, ఉదకముల అనుసంధానము అన్నమువల్ల జరుగుచు, అన్నమునందు ప్రతిష్ఠితమగుచున్నదను విషయమును తెలిసినవాడు కూడ ప్రతిష్ఠితుడగుచున్నాడు. అంతియేగాక, అన్నము కల్గినవాడై... కీర్తిమంతు డగుచున్నాడు.

వివరణము :- అన్నము విషయములో పాటింపవలసిన రెండవ నియమమును ఈ అనువాకములో చెప్పుచున్నాడు. 'అన్నమును పారవేయకుండుట' ఈ రెండవ నియమము. అనగా కావలసినది మాత్రమే వడ్డించుకొని, వడ్డించుకొనినవన్నియు పారవేయకుండా తినుట. అన్నమును తయారుచేయుటలో కాని, ఒకచోట చేర్చుటలో గాని వృథాగాకుండా చూడవలెను (There must not be any waste in preparation and procurement of food). మనకు నచ్చని పదార్థ మని ముందే తెలిసినపుడు- వడ్డించునపుడు ముందే వద్దనవలెనుగాని వడ్డించినతరువాత పారవేయరాదు. భోజనకాలమునకు ప్రాప్తమైన ఆహారమును స్వీకరించడమే యుక్తముగాని, మంచిదికాదని పారవేయుట యుక్తముకాదు. ఈ నియమమునుగూడ వ్రతదీక్షగా పాటింపవలెను. మనము దేనివల్ల వృద్ధి అగుచున్నామో దానినే చేతులారా పారవేయుట మనవృద్ధికి మనమే అడ్డు

పడుట అగును. ఇట్లు అన్నమును పారవేసినవానికి- పార వేయునప్పుడు తెలియదుగాని- "ఏ రకమైన ఆహారమైనను తినుటకు ఉన్నచో చాలును" అనెడి పరిస్థితి తనజీవితములో ఎదుర్కొనవలసివచ్చును.

సాధారణముగా శుభకార్యములయందు, విందు లందు అన్నమును సగముతిని, సగము పారవేయుట జరుగు చుండును. పైగా, ఆ విధముగా పారవేయుట వలన ముష్టి వారికి, అన్నములేనివారికి తృప్తిజరుగునని గొప్పగా చెప్పు కొనుచుందురు. ముష్టివారికి నిజముగా అన్నమును పెట్టదలుచు కొన్నచో- సగముతినినది, ఎంగిలి చేసినది, పాడై పార వేయుస్థితిలో ఉన్నదానిని, వారి ముఖమున కొట్టుటకన్న- ఎంగిలిచేయని, పాడవని అన్నమును పెట్టుటయే ధర్మము. వండిన అన్నమును తాను ఎంగిలిచేయకుండతినగా ఇంకను మిగిలినచో, అట్టి అన్నమును అవతలపారవేయకుండా ఇతరు లకు పెట్టవచ్చును. కావున ఎట్టిపరిస్థితులలోనైనను అన్నము సద్వినియోగమగుట చూడవలెనుగాని, వృథాకానీయరాదని తెలుసుకొనవలెను.

తీసుకొనిన పానీయములు జఠరాగ్నిచేఅరుగుచున్నవి. కావున, జలము- అన్నముకాగా, ఆ జలములను అగ్ని తినుచూ అన్నాదము అగుచున్నది. జలమునందు అగ్ని వున్నదనువిషయము చిత్రమనిపించును. ఉదజని, ఆమ్లజని

(Hydrogen & Oxygen) కలిసి నీటి ఆవిరిగా ఏర్పడినపుడు కొన్ని వేల కెలోరీల ఉష్ణశక్తి పుట్టును. ఇది జలమునందు నిక్షిప్తమై ఉండును. అందుచేతనే జలమునందు అగ్ని ఉన్నదని ఇచ్చట చెప్పబడినది. శరీరములో ఉష్ణాధిక్యతవలన తాపము పుట్టి స్వేదము బహిర్గతమగును. అనగా జలరూపములోనున్న చెమట- దేహమునకు తాపమును కల్గించిన అగ్నినుండి జనించినదని- దీనిని బట్టి తెలియును. అందుచేతనే ఇచ్చట జ్యోతిస్సునందు జలములు ప్రతిష్ఠితమైనవని చెప్పబడినది. ఇవి రెండూనూ ఒక దానికొకటి అన్నము, మరియు అన్నాదము అగుచున్నవి. ఈ విషయమును తెలిసినవాడు అన్నమునుకలిగినవాడై, అన్నమును అరిగించుకొనగల జఠరాగ్నిని కలిగి, అన్ని విధములుగ పూర్వము చెప్పినట్లు యశస్సుతో వర్థిల్లును.

మంత్రము :

అన్నం బహు కుర్వీత । తద్వ్రతమ్ । పృథివీ వా అన్నమ్ । ఆకాశోఽన్నాదః । పృథివ్యా మాకాశః ప్రతిష్ఠితః। ఆకాశే పృథివీ ప్రతిష్ఠితా । తదేత దన్నమన్నే ప్రతిష్ఠితమ్ । స య ఏత దన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవా

నన్నాదో భవతి । మహాన్భవతి ప్రజయా పశుభి ర్బ్రహ్మ

వర్చసేన । మహా న్కీర్త్యా ॥

టీక :- అన్నం = అన్నమును, బహుకుర్వీత = సమృద్ధిపరచవలెను, తత్ = అది, వ్రతమ్ = వ్రతము, పృథివీ = భూమి, అన్నంవై = అన్నముగదా, ఆకాశః = ఆకాశము, అన్నాదః = అన్నాదము, పృథివ్యాం = భూమియందు, ఆకాశః = ఆకాశము, ప్రతిష్ఠితా = ప్రతిష్ఠితమై ఉన్నది, ఆకాశే = ఆకాశమునందు, పృథివీ = భూమి, ప్రతిష్ఠితా = ప్రతిష్ఠితమై ఉన్నది, తత్ = అందువలన, ఏతత్ = ఈ (భూమి, ఆకాశముల) జంట, అన్నే = అన్నమునందు, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠితమై ఉన్నది, (మిగిలిన పదములకర్థములు పూర్వానువాకములో కలవు.)

తాత్పర్యము :- 'అన్నమును సమృద్ధిచేయవలెను,' ఈ నియమమును వ్రతముగా పాటించవలెను. భూమియే అన్నము. ఆకాశము అన్నాదము. భూమియందు- ఆకాశము, ఆకాశమందు- భూమి ప్రతిష్ఠతమగుచున్నవి. ఇవి ఒక దాని కొకటి అన్నము, అన్నాదములు. ఈ విషయము తెలిసిన వాడు తాను కూడ ప్రతిష్ఠితుడై పూర్వము చెప్పినట్లు అన్ని విధములుగా వర్ధిల్లి కీర్తిమంతుడగును.

వివరణము :— అన్నమునుగూర్చి మరియొక నియమము చెప్పబడుచున్నది. అన్నమును సమృద్ధి చేయవలెను "అన్నమును ఎక్కువగా సంపాదించవలెను. లేదా సమృద్ధి చేయవలెను." (Try not to earn food but to produce it) అనుట సరియైన పద్ధతి. 'సంపాదించుట' అన్నది నోట్లకట్టలకు చెల్లును కాని, అన్నము విషయములో సరికాదు అన్నమునకు సంబంధించిన పంటను పండించక నోట్లకట్టలను సంపాదించుటకు ప్రాధాన్యమిచ్చినచో - ద్రవ్యోల్బణము వచ్చి, సంచులతో నోట్లకట్టలను తీసుకువెళ్ళి, జేబునకు సరిపడు తినుబండారమును కొనుక్కొనవలసిన దుస్థితి ఏర్పడును. అందుచే, ఏ దేశ ప్రభుత్వమైననూ తిండిగింజలను పండించుటకు ముందు ప్రాధాన్యమిచ్చి, అటుపైన మిగిలిన ద్రవ్యముల ఉత్పత్తికి, ఎగుమతికి ప్రాధాన్యమీయవలెను. ఆ ఎగుమతికూడ మన దేశప్రజలకు సరిపడగా మిగిలినవాటినే ఎగుమతి చేయవలెను. అన్నపానీయములకు సంబంధించినవాటిని- 'ఎక్కువ డబ్బులు వచ్చును గదా'అని స్వదేశప్రజలకు అందకుండా విదేశములకు పంపినచో- నోట్లకట్టల ఎదురుగా కూర్చొని అన్నమునకు బాధపడవలసి వచ్చును. అందుచే, ఎప్పుడునూ నోట్లకట్టలమీాదగల దృష్టి నుండి సంపదను పెంపొందించుటవైపు మనదృక్పథము మారవలెను. We have to change our outlook from money

to wealth) ఒక వ్యక్తికి డబ్బునుఇచ్చి సంతృప్తి పరచ లేమేమోగాని అన్నమును పెట్టి సంతృప్తి పరచవచ్చును. అందువల్ల, తృప్తి- అన్నమువల్ల వచ్చునుగాని, డబ్బువల్ల రాదు. అందుచేతనే, ఇచట 'అన్నమును సమృద్ధిచేయుము' అను నియమము చెప్పబడెను. సమృద్ధి చేయుటలో ఒళ్ళు దాచుకొనకుండా, కష్టపడి సాధించుట తప్పుగాదు. కష్టపడకుండా సంపాదించవలెనను మార్గము మాత్రము తప్పు. అందుచే, ప్రతివారును అన్నమును సమృద్ధిచేయుటలో ఎక్కువగా పాలుపంచుకొనినచో ప్రజలకు తిండికి లోటు ఉండదు.

భూమి - ఆకాశమునందును, ఆకాశము - భూమి యందును ప్రతిష్ఠితమై ఉన్నవని ఇచ్చట ప్రతిపాదింపబడెను. ఆధ్యాత్మికముగా చెప్పుకొన్నచో దీనిలో కొంత సాంకేతిక (symbolic) రహస్యము కలదు. ఇచ్చట 'భూమి'- అనగా 'దేహము', 'ఆకాశ' మనగా- 'చోటు'.జీవియొక్క దేహము ఆకాశములోనున్నది. ఈ దేహములోపల దహరాకాశము ఉన్నది. అందుచే- 'చోటు,దేహములు' అనగా 'ఆకాశము- భూమి' ఒకదానిలో ఒకటి ప్రతిష్ఠితమై ఉన్నవి' అని చెప్ప బడినది. ఇది ఎట్లనగా చోటులో చెంబువున్నపుడు, ఆ చెంబులో మరల చోటువుండును గదా. నల్లబల్లపై ఒక వృత్తమును గీసినపుడు- నల్లబల్లయందు వృత్తము, వృత్తము

లోపల మరల నల్లబల్ల వుండునుగదా! ఈ విధముగా జీవి పట్లకూడా అర్థము చేసికొనవలెను. 'ఆకాశమునందు - దేహము, దేహమునందు- దహరాకాశము ప్రతిష్ఠితమై, ఈ జంటవలన ఆ జీవి సుప్రతిష్ఠితుడగుచున్నాడు' అను అర్థములో "ఎవరు దీనిని తెలుసుకొనుచున్నారో వాడునూ ప్రతిష్ఠితుడగుచున్నాడు" అని చెప్పబడినది. ఇట్టివాడు సుప్రతిష్ఠితుడు అగుటయేగాక ఇంతకు పూర్వము చెప్పినట్లు అన్నాదిక సదుపాయములతో వర్ధిల్లి కీర్తిమంతుడగును. కేవలము బాహ్యార్థము మాత్రమే కావలెనన్నచో 'భూమినుండి అన్నమునకు సంబంధించిన పంట పండుచున్నది. భూమియందలి జలములను, ద్రవ్యములను సంవత్సర యజ్ఞములో ఆకాశము గ్రహించుచున్నది. అందుచే ఆకాశమునకు- భూమి అన్నము. ఆకాశమునుండి సూర్యరశ్మిని, మేఘముల ద్వారా వర్షమును భూమి గ్రహించి పంటను పండించుచున్నది. అందుచే ఆకాశము భూమికి అన్నమగును.అన్నము ఈ విధముగా రెంటిని సంధించుచున్నది' అని చెప్పుకొనవచ్చును.

మంత్రము:

న కంచన వసతౌ ప్రత్యాచక్షీత । తద్వ్రతమ్। తస్మాద్యయాకయా చ విధయా బహ్వన్నం ప్రాప్నుయాత్ ।

అరాఖ్యస్మా అన్న మిత్యాచక్షతే । ఏతద్వై ముఖతో ఉన్నగ్ం రాద్ధమ్ । ముఖతో ఉస్మా అన్నగ్ం రాధ్యతే । ఏతద్వై మధ్యతో ఉన్నగ్ం రాద్ధమ్ । మధ్యతో ఉస్మా అన్నగ్ం రాధ్యతే । ఏతద్వా అన్తతో ఉన్నగ్ం రాద్ధమ్ । అన్తతో ఉస్మా అన్నగ్ం రాధ్యతే । య ఏవం వేద । క్షేమ ఇతి వాచి । యోగక్షేమ ఇతి ప్రాణాపానయోః । కర్మేతి హస్తయోః । గతి రితి పాదయోః । విముక్తి రితి పాయౌ । ఇతి మానుషీ స్సమాజ్ఞాః । అథ దైవీః । తృప్తి రితివృష్టౌ । బలమితి విద్యుతి। యశ ఇతి పశుషు। జ్యోతి రితి నక్షత్రేషు।

ప్రజాతి రమృత మానన్ద ఇత్యుపస్థే । సర్వ మిత్యాకాశే ।
తత్ప్రతిష్ఠేత్యుపాసీత । ప్రతిష్ఠావా న్భవతి । తన్మహ ఇత్యు
పాసీత । మహాన్భవతి । తన్మన ఇత్యుపాసీత । మానవా
న్భవతి । తన్నమ ఇత్యుపాసీత । నమ్యన్తే ఽస్మై కామాః ।
తద్బ్రహ్మేత్యుపాసీత । బ్రహ్మవా న్భవతి । తద్బ్రహ్మణః
పరిమర ఇత్యుపాసీత। పర్యేణం మ్రియన్తే ద్విషన్త స్సపత్నాః।
పరి యే ఽప్రియా భ్రాతృవ్యాః । స య శ్చాయం పురుషే ।
యశ్చాసా వాదిత్యే । స ఏకః । స య ఏవం విత్ । అస్మా
ల్లోకా త్ప్రేత్య । ఏత మన్నమయ మాత్మాన ముపసంక్రమ్య ।
ఏతం ప్రాణమయ మాత్మా న ముపసంక్రమ్య। ఏతం మనో

మయ మాత్మాన ముప సంక్రమ్య।ఏతం విజ్ఞానమయమాత్మాన
ముప సంక్రమ్య । ఏత మానన్దమయ మాత్మాన ముప
సంక్రమ్య। ఇమాన్లోకా న్కామాన్నీ కామ రూప్యనుసంచరన్।
ఏత త్సామ గాయన్నాస్తే। హా౩వు హా౩వు హా౩వు।అహమన్న
మహ మన్నమ్ । అహ మన్నాదో౩ ఽహమన్నాదో౩ ఽహమ
న్నాదః। అహగ్గ్ శ్లోకకృ దహగ్గ్ శ్లోకకృ దహగ్గ్ శ్లోకకృత్।
అహ మస్మి ప్రథమజా ఋతా౩స్య। పూర్వం దేవేభ్యో అమృ
తస్య నా౩భా౩ఇ । యో మా దదాతి స ఇ దేవ మా౩ఽఽవాః।
అహ మన్న మన్న మద న్త మా౩ద్మి। అహం విశ్వం భువన
మభ్యభవా౩మ్ । సువర్ణ జ్యోతీః । య ఏవం వేద । ఇత్యు
పనిషత్ ॥

టీక :- వసతౌ = వసించుటకువచ్చిన, కంచన = ఎవ్వనిని, న ప్రత్యాచక్షీత = వలదనకూడదు, తత్ = ఆ విధముగాచేయుట, వ్రతమ్ = వ్రతదీక్ష, తస్మాత్ = అందువలన, యయాకయా చ విధయా = ఏదో ఒక విధానముచేత, అన్నమ్ = అన్నమును, బహు = సమృద్ధిగా, ప్రాప్నుయాత్ = (నివాసమునందు) ఉండునట్లు చూడవలెను, అన్నమ్ = అన్నము, అస్మై = (ఇంటికి వచ్చిన) వాని కొరకు, అరాధి = సిద్ధముగా నున్నది, ఇతి = అని, ఆచక్షతే = పలుకుచున్నారు (పలుకవలెను), అన్నమ్ = అన్నము, ఏతత్ ఈరాద్ధమ్ = ఇదిగో సిద్ధమైనది, (అని)' ముఖతః = నోటితో అనుచున్నాడో, అస్మై=అట్టివానికి, ముఖతః = ముందే, అన్నమ్ = అన్నము, రాధ్యతే = పొందబడుచున్నది, అన్నమ్=అన్నము, ఏతత్ ఈరాద్ధమ్= ఇదిగో సిద్ధమైనది (అని), మధ్యతః = మధ్యమముగా, (ఇచ్చునో), అస్మై = (అట్టి) వానికొఱకు, మధ్యతః = మధ్యమదశలో, అన్నమ్ = అన్నము, రాధ్యతే = పొందబడుచున్నది, అంతతః=అంతమునందు, అన్నం=అన్నము ఏతత్ ఈ రాద్ధమ్=సిద్ధమైనదని (అనుచున్నాడో),అస్మై= (అట్టి) వానికొఱకు, అన్తతః = అంత్యదశలో, అన్నమ్= అన్నము, రాధ్యతే = పొందబడుచున్నది, యః =ఎవ్వడు, ఏవం = ఈ విధముగా, వేద = తెలుసుకొనుచున్నాడో,

(వాని), క్షేమ ఇతి వాచి = వాక్కునందు క్షేమము ఉండును, యోగక్షేమ ఇతి ప్రాణాపానయోః = ప్రాణాపానములవలె యోగ క్షేమములు, (వెన్నంటినిల్చును), కర్మేతి హస్తయోః = పనుల కొఱకు చేతులు వుండిపోవును, గతి రితి పాదయోః = పాదములలో గమనము స్థాపింపబడును, విముక్తి రితి పాయౌ = అనవసరమైనవాటిని పాయువు విసర్జించినట్లు అనవసర దురభిప్రాయములను వదలి పెట్టును, ఇతి మానుషీః = ఇవి మనుష్యసంబంధమైన, సమాజ్ఞాః = జ్ఞానాత్మక ఉపాసనలు, అథ = ఇటుపైన, దైవీః = ఆధిదైవిక ఉపాసనలు, (చెప్పబడును), తృప్తి రితి వృష్టౌ = తృప్తియే వృద్ధి, బల మితి విద్యుతి = విద్యుత్తు-బలము, యశ ఇతి పశుషు = పశువులందు యశస్సు, జ్యోతిః ఇతి నక్షత్రేషు = నక్షత్రములయందు ప్రకాశము, ఉపస్థే = జననేంద్రియమునందు, ప్రజాతిః అమృతమ్ = సంతానోత్పత్తి వలన తండ్రికి అమృతత్వము సిద్ధించి, ఆనన్దమ్ = ఆనందముతో నుండుట, సర్వమిత్యాకాశే = సర్వము ఆకాశమునందే ప్రతిష్ఠితమై ఉన్నదని, తత్ = ఆ బ్రహ్మము ఐన ఆకాశము, ప్రతిష్ఠా ఇతి = సర్వమునకు ప్రతిష్ఠయని, ఉపాసీత = ఉపాసించవలెను, (అప్పుడు వాడు) ప్రతిష్ఠావాన్ = ప్రతిష్ఠకలవాడు, భవతి = అగుచున్నాడు, తత్ = ఆ బ్రహ్మమైన ఆకాశమును, మహః ఇతి = మాహాత్మ్య

గుణముకలదానిగా ఉపాసీత = ఉపాసించవలెను, (అప్పుడు వాడు), మహాన్ భవతి = మహానీయుడగుచున్నాడు, తత్ = ఆ బ్రహ్మమైన ఆకాశమును, మనః ఇతి = మానవ స్వరూపమని, ఉపాసీత = ఉపాసించవలెను, (అప్పుడు వాడు) మానవాన్ భవతి = సమర్థుడగును, తత్ = ఆ బ్రహ్మమైన ఆకాశమును, నమః ఇతి = నమనగుణము అనగా, వినయగుణముకలదానిగా, ఉపాసీత = ఉపాసించ వలయును, అస్మై = (ఈ విధముగా) ఉపాసించు వానికి, కామాః = భోగ్యమైనవస్తువులు, నమ్యన్తే = లోబడు చున్నవి లేదా పొందబడుచున్నవి, తత్ = ఆ బ్రహ్మమైన ఆకాశమును, బ్రహ్మ ఇతి = బ్రహ్మణశక్తి రూపమని, ఉపాసీత = ఉపాసించవలెను, (అప్పుడు వాడు), బ్రహ్మవాన్ = బ్రహ్మసమానుడు, భవతి = అగుచున్నాడు, తత్ = బ్రహ్మమైన ఆకాశమును, బ్రహ్మణః = బ్రహ్మమునకు, పరిమరఇతి = పరిమరమని, ఉపాసీత = ఉపాసించవలెను, పర్యేణం = అట్టివానిని, ద్విషన్తః = ద్వేషించునట్టి, సపత్నాః = ప్రత్యర్థులు, మ్రియన్తే = లోబడుచున్నారు, అప్రియాః = అప్రియులగు, భ్రాతృవ్యాః = సోదరతుల్యులును, పరిమ్రియన్తే = లొంగుచున్నారు, పురుషే = పురుషునియందు, యః చ = ఏ ఆత్మకలదో, సః అయమ్ = ఆ ఈ ఆత్మయు, ఆదిత్యే = ఆదిత్యునియందు, లేదా సూర్యునియందు, యః చ = ఏ

ఆత్మకులలో, ఆత్మా ఈ ఆత్మయు, సః ఏకః = ఒక్కడే, యః = ఎవ్వడు, ఏవంవిత్ = ఈ విధముగా తెలుసుకొనునో, సః = వాడు, అస్మాత్ లోకాత్ = ఈ లోకమునుండి, ప్రేత్య = విడిచి, ఏతమ్ అన్నమయమ్ = ఈ అన్నమయుని, ఆత్మానం = ఆత్మను, ఉపసంక్రమ్య = పొంది, అట్లే ప్రాణమయ, విజ్ఞానమయ ఆనందమయాత్మకుని పొంది. ఇమాన్లోకాన్ ఈ లోకములను, అనుసంచరన్ = సంచరించుచు, కామాన్నీ = కామానుసారమగు అన్నముగలవాడై, కామరూపి = కామరూపియై, అనుసంచరన్ = సంచరించుచు, ఏతత్ సామగాయన్ = ఈ చెప్పబోవునట్టి సామగానముచేయుచు, ఆస్తే = ఉండును, హాఽవు = ఆశ్చర్యముగదా, (మూడుసార్లు) అహం = నేను, అన్నమ్ = అన్నస్వరూపుడను, (మూడుసార్లు), అహం = నేను, అన్నాదః = అన్నాదుడను లేదా అన్నముతినువాడను (మూడుసార్లు), శ్లోకకృత్ = శ్లోకకృత్తు అనగా ఈ చెప్పువాసిని, (అగుచున్నాడను), అహం = నేను, ఋతస్య = ఋతముకంటె, దేవేభ్యః = దేవతలకంటె, పూర్వమ్ = ముందు, ప్రథమజాః = మొదట పుట్టినవాడను, అస్మి = అగుచున్నాడను, అమృతస్య = అమృతమునకు, నాభిః = నాభిమాత్రుడను (అగుచున్నాను), యః = ఎవ్వడు, మా = నన్ను, దదాతి = ఇచ్చుచున్నాడో, సఇత్ = వాడే,

ఏవం = ఈ విధముగా (నన్ను), ఆహా = సంరక్షించును, అహం = నేను, అన్నమ్ = అన్నమును, అదన్తమ్ = తిను వానిని, అద్మి = తినుచున్నాను, అహం = నేను, విశ్వ భువనం = సమస్త ప్రపంచమును, అభ్యభవామ్ = తిరస్కరించి అతిక్రమించుచున్నాను, సువర్ణజ్యోతిః = (నేను) సువర్ణ దీప్తిమంతుడను, యః = ఎవ్వడు, ఏవం = ఈ విధముగా, వేద = తెలుసుకొనునో, ఇతి = ఈ, ఉపనిషత్ = ఉపనిషత్తు (వానిని గురించియే చెప్పబడినది.)

తాత్పర్యము:- 'గృహమునందు వసింపవచ్చిన వానిని ఎవ్వనిని నిషేధింపరాదు.' ఈ నియమమును వ్రతముగా పాటింపవలెను. ఇందులకై ఏదోఒక విధానమువలన అన్నము సమృద్ధిగానుండునట్లు తగిన ఏర్పాటులో ఉండవలెను. వచ్చినవారెవరికైనను 'ఇదిగో అన్నము సిద్ధముగానున్నది' అని చెప్పగల్గునట్లుండవలెను. ఈవిధముగా జీవితము మొదటి నుండి చెప్పగల్గువానికి మొదటి నుండి అన్నాదికమునకు లోటు వుండదు. జీవితము మధ్యభాగమునుండి ప్రారంభించు వానికి- మధ్యభాగమునుండే అన్నాదికమునకు లోటు వుండదు. జీవిత అవసానదశలో దీనిని అనుసరించినపుడు- అవసానదశనుండే అన్నాదికమునకు లోటు వుండదు. ఆ అన్నాదికముకూడా తాను పెట్టిన ఆహారమునుబట్టి, ఉత్తమ, మధ్యమ, అధమ ఫలితములలో వచ్చుచుండును. ఈ విషయ

మును తెలిసి జీవితమును సమస్తము పరచుకొనవలెను. వాక్కునందు యోగక్షేమములు- ప్రాణాపానముల జంటవలె కలిసియుండునని, పాదములు ధర్మైకముఖముగా చరింపవలెనని, ఉపస్థమైన మందప్రాయాములను మల, మూత్రముల వలె విసర్జించవలెనని గ్రహించవలెను. ఇవి మనుష్య సంబంధమైనవి. ఇక, దైవసంబంధమైనవి, జ్ఞాన ప్రాప్తికరమైనవి చెప్పవలెనన్నచో- తృప్తి-వృద్ధినిచ్చునని, బలము విద్యుత్తు నందలిదిగా వినియోగపడవలెనని, పశువులు- కీర్తికారకములని. నక్షత్రములందలి స్వయంప్రకాశమువలె వెలుగొందవలెనని' సంతానోత్పత్తితో అమృతత్వవంతుడై ఆనందమును పొందవలెనని, సర్వము ఆకాశమునందే వున్నదని తెలుసుకొనవలెను లేదా ఉపాసించవలెను. ఆకాశము సర్వమునకు ప్రతిష్ఠ అని ఉపాసించినవాడు తానును ప్రతిష్ఠితుడగును. ఆకాశమును మహత్వ గుణముగలదిగా ఉపాసించినవాడు తానును మహనీయుడగును. ఆకాశమును మనన స్వరూపముగలదిగా ఉపాసించినవాడు తానును మనన సమర్థుడగును. ఆకాశమును నమనగుణముగలదిగా ఉపాసించు వానికి కావలసినవి చేకూరుచుండును. ఆకాశమును ఉపాసించువాడు తానును బ్రహ్మణశక్తిగలిగి బ్రహ్మాంశవాడగును. ఆకాశమును బ్రహ్మమునకు పరిమరమని ఉపాసించువానికి ద్వేషించునట్టి ప్రత్యర్థులు తొలగి

పోవుదురు. కావలసినవారైనను, అప్రియులైనచో- తొలగి పోవుదురు. పురుషునియందలి ఆత్మ, ఆదిత్యునియందలి ఆత్మ ఒక్కటే అని తెలుసుకొనువాడు ఈ లోకమును విడిచి అన్నమయాత్మను, ప్రాణమయాత్మను, మనోమయాత్మను, విజ్ఞానమయాత్మను, ఆనందమయాత్మను పొంది భూర్భువస్సువరాది లోకములన్నిట సంచరించగలిగి, కావలసిన అన్నముగలవాడై, ఇష్టరూపముతో సంచరించుచూ- 'ఆహా! ఎంత ఆశ్చర్యము? నేను అన్నస్వరూపుడను. నేను అన్నాదుడను, నేను ఇట్లనగలుగు శ్లోక కృత్తును. నేను ఈ జగత్తు కంటె, నిశ్చయాత్మకసత్యము కంటె, దేవతలకంటె ముందువాడను, మొదటివాడను. అమృతమునకు మూల బిందువువంటివాడను. అన్నస్వరూపుడనగు నన్ను ఎవడు అన్నార్థులకు ఇచ్చునో వాడే నన్ను సంరక్షించును. నేను అన్నమును తినుచున్నాను. నేను సమస్తవిశ్వమును అతిక్రమించి అతీతుడుగా ఉన్నాను, నేను సువర్ణదీప్తిమంతుడను.' అని సామగానము చేయును ఈ విధముగా ఎవడు తెలుసుకొనునో వానికొఱకే, ఆ తెలుసుకొనువానిని గూర్చియే ఈ ఉపనిషత్తు చెప్పబడినది.

వివరణము :— క్రిందటి అనువాకమువరకు అన్నమును గూర్చి వ్యక్తిగతముగా పాటింపవలసిన వ్రతనియమములు

చెప్పబడినవి. ప్రస్తుత అనువాకములో మన ఇంటికి వచ్చేదు వారిపట్ల మనము ఆచరింపవలసిన కొన్ని ప్రతవిశేషములు చెప్పబడును. "ఎవరైన మన ఇంటికి విశ్రమించుటకు గాని, శ్రమదీర్చుకొనుటకు గాని, వచ్చినపుడు 'ఉండుటకు వీలులేదు', అని అనరాదు." అను నియమము చెప్పబడినది. ఇది చోటుపట్ల మనము తెలుసుకొనవలసిన పరమసత్యము. మనము ఎన్ని ఋణములైనను తీర్చుకొనగలమేమోగాని, చోటుయొక్క ఋణమును తీర్చుకొనలేము. మన దేహఘనపరిమాణము ఎంతవుండునో అంతచోటు (our own volume of space) మనము ప్రపంచమునకు ఋణపడివున్నాము. మనము ఎక్కడ వున్నను, ఎప్పుడు ఏ స్థితిలో ఉన్నను ప్రపంచములోని ఈ మేరకు ఆక్రమించుకొనుచున్నాము. ఇది డబ్బులు ఇచ్చికొనినదికాదు. అనగా, స్వంతము కాదు. కావున చోటుపట్ల మనము ఈ విధముగా ఋణపడివున్నాము. ఈ చోటు మనదికాదు. మన తాతతండ్రులదికూడకాదు. మనము చనిపోవునంతవరకు చోటుపట్ల మన ఈఋణము తీరనిదే! ఒకవేళ ఇంటిలో ఉన్నపుడు ఆ 'ఇంటిస్థలము మనము కొన్నదేకదా' అని అనుమానము రావచ్చును. కాని "ఆ ఇల్లువున్న స్థలముయొక్క పొడవు

వెడల్పు వలన కలిగిన భూవైశాల్యము గల స్థలమును కొంటిమిగాని, ఎత్తునుబట్టి వచ్చు చోటును కొనలేదుగదా" అని తెలుసుకొనవలెను. ఆ స్థలమును గూడా మొట్టమొదట అనుభవించినవాడు ఎవరిదగ్గఱను కొనలేదు. ఉన్నస్థలమును ఆక్రమించుట జరిగి వుండవలెనుగదా! 'ఆ విధముగా ఆక్రమింపబడిన స్థలము ఎవరిది?' అని ప్రశ్న వేసుకొనినచో మన బండారము బయటపడును. కాబట్టి ఇంటిలోని మొత్తముచోటు పూర్తిగా మన స్వంతముగాదని గ్రహించి, ఎవరైన వచ్చి ఉండుటకు అడిగినపుడు మనము ఆ చోటును ఎట్లు వినియోగించుకొనుచున్నామో వారికిని అట్టి అవకాశము ఈయవలెనని ఈ మంత్రమునకు అర్థము.

ఇంటికి వచ్చినవానికి లేదనకుండా "అన్నము ఇదిగో సిద్ధముగా ఉన్నది. రండి" అని ఆతిథ్యమును ఇచ్చుటకు సరిపడు అన్నము సిద్ధముగానుండునట్లు ఏదో ఒక విధమైన పద్ధతిని ఏర్పాటు చేసుకొనవలెను. ముఖ్యముగా (1)అన్నము తిననివారు, (2) ఆకలితో నున్నవారు, (3) మనము తినుచున్నప్పుడు వచ్చినవారు ఐనచో తప్పక వారికి అన్నమును పెట్టి తీరవలెను. 'ఎవరికి అన్నముపెట్టవలెను?' అను ప్రశ్నకు 'ఈ పై చెప్పినమూడును- సరిపోవువానికి' అని సమాధానముగా గ్రహించవలెను.

తల్లిని, తండ్రిని, ఆచార్యుని మాత్రమేకాక మన ఇంటికి అవాంతరముగా వచ్చిన 'అతిథి'నిగూడ దైవముగా ఆరాధించవలెనని శిక్షావల్లిలో అనుశాసన అనువాకము నందు చెప్పబడినది. తల్లి, తండ్రి, గురువులకు మనము ఎట్లును ఋణపడివుందుము కాని, అతిథికి ఆ విధముగా ఋణపడి లేకపోయినను ఆ అతిథియందుగూడ దైవభావము ను కలిగియుండమని చెప్పుట భారతీయుల సంస్కార బుద్ధిని తెలియజేయును. అటువంటి అతిథి ఎప్పుడైన మన ఇంటికి వచ్చినపుడు పొమ్మనరాదు, పగలువచ్చిన అతిథికన్న సాయంకాలము, రాత్రిపూటలలో వచ్చు అతిథులను అసలు పొమ్మనరాదు. రాత్రికి వారు పడుకొనుటకు ఎక్కడకని పోగలరు? (పూర్వపు రోజులలో హోటల్స్, లాడ్జీలు వుండెడివికావు. మనము వారి వూరు వెళ్ళినపుడుగూడ మనలను వారు అట్లే ఆదరించి అతిథిమర్యాదలుచేయుదురు. కాబట్టి, ఎవరు ఏ వూరు వెళ్ళినను హోటలు, లాడ్జీలు, లేక పోయినను ఇబ్బంది పడెడివారు కాదు. మరియు, హోటలు వాడు భోజనము పెట్టుటలో చూపు ప్రేమ, ఆపేక్షలకన్న గృహస్థు- అతిథిని దైవముగా చూచునుగాబట్టి - ఎక్కువ ప్రేమ, శ్రద్ధలను చూపును.)

సాధారణముగా మిగిలిన దేశములలో అతిథులకు అన్నము పెట్టినతరువాత, ఆఅతిథులు (Guests) గృహస్థునకు

(Host) కృతజ్ఞతలు (Thanks) చెప్పుకొందురు. కాని, భారత దేశములో 'అతిథి ఇంటికి వచ్చుటను' ఒక వరముగా, గొప్ప అవకాశముగా భావించి వారికి అన్నమును పెట్టిన తరువాత ఆ అతిథులకే గృహస్థు కృతజ్ఞతలు చెప్పును. ('మిగిలిన దేశములకు భారతదేశమునకు భేదమును చెప్పు'మనగా వివేకానందుడు ఒక విదేశస్థునకు ఈవిషయమునుచెప్పెను). ఇది భారతీయుల సంస్కారమునకు ఉత్తమ నిదర్శనము.

ఒకరికిపెట్టు అన్నమునుబట్టి మనకు అన్నము లభించును. ఈ ధర్మసూత్రములో మూడురకములైన విషయములు చెప్పబడినవి. ముఖతః, మధ్యతః, అంతతః అను మూడుపదములు ప్రయోగింపబడినవి. ఈ ఒక్కొక్క పదమునకు రెండు. మూడు అర్థములు కలవు. (1) నోటితో అన్నమును స్వీకరించుట ప్రారంభించిన నాడు, (2) జననమరణముల మధ్యగల జీవితకాలమందు, (3) శరీరమును వదలివేయుచు పంచభూతములలో దేహము కలియుచున్నపుడు, ఈమూడు స్థితులలోను అన్నమువలన తాను ఆరాధింపబడినాడని, అనగా అనుసంధానింపబడినాడని తెలుసుకొనుట ఒక సత్యము. పుట్టినప్పటి మొదటిస్థితినుండి ఇంకొకరికి అన్నముపెట్టు స్వభావము ఉన్నచో మొదటినుండి తాను అన్నమునకు లోటులేనివా

డగునని, మధ్యవయస్సునుండి ప్రారంభించినచో మధ్య వయస్సు నుండి. చివరిదశలో ప్రారంభించినచో చివరిదశ లోను అన్నమునకు లోటులేనివాడగునని తెలుసుకొనుట రెండవసత్యము. అన్నము పెట్టునపుడు గూడ మొదటిరక మైన అన్నమును, ఉత్తమోపచారములతో, అడిగిన వెంటనే పెట్టినచో అట్టి రకమైన అన్నమే, అట్టి ఉత్తమోపచారము లతో తానునూ పొందుననీ, మధ్యరకమైన దానిని పెట్టి నచో మధ్యరకమైనదానినే పొందునని, మూడవరకమైన భోజనమును పెట్టినచో మూడవరకమైన భోజనమే తానునూ పొందునని తెలుసుకొనుట మూడవసత్యము. అనగా 'నీవు పెట్టినదానిని బట్టి నీకు గిట్టును'(As you sow so you reap) అని ఈ మంత్రములకు అర్థము (బ్యాంకులో వేసుకున్న డిపాజిట్ ధనమునుబట్టి తీసుకొనుట (Wrthdraw) ఆధార పడి ఉండునని మనకు తెలిసిన విషయమేగదా!)

'To every actioa there is always an equal and opposite reaction' అను దానిని భౌతిక శాస్త్రములో న్యూటన్ మూడవగమన సూత్రముగా చెప్పుదురు. "ప్రతి చర్యకు దానికి సమానముగాను, వ్యతిరేకదిశలోను పనిచేయు ప్రతిక్రియచర్య ఉండును." అని ఈ సూత్రముయొక్క అర్థము. 'మనము ఒకరికి పెట్టినదానిని బట్టి మనకు గిట్టును' అని ఇంతకు పూర్వము చెప్పిన విషయములోను,'చేసుకున్న

వారికి చేసుకున్నంత మహాదేవా' అను సామెతలో చెప్పిన విషయములోను, 'As you sow, so you reap', 'The more you give the more you have' అను ఇంగ్లీషు సామెతలలో చెప్పిన విషయములలోను అంతర్లీనమై వున్న సత్యమును భారతీయుల కర్మసిద్ధాంత సారాంశముగా గ్రహించవలెను. కర్మ సిద్ధాంతములో రెండు అంశములు ఇమిడి వుండును. అవి ఒకదానికొకటి పరిపూరకములే (Complimentary)గాని విరుద్ధములు (opposites) కావు. ఆ రెంటిని (1)విధివ్రాత, (2)పురుషప్రయత్నము అనవచ్చును. వీటి అవగాహన సరిగాలేకపోయినచో కర్మసిద్ధాంతము మెట్ట వేదాంతమనకే దారితీయునుగాని అందలి సూక్ష్మమైన ఆధ్యాత్మిక దృక్పథమును అర్థము చేసుకొనుట జరుగదు. అందువలన ఒక బీజగణిత శాస్త్రోదాహరణద్వారా ఆ విషయము ముందు వివరింపబడును.

x అను రాశియొక్క విలువ మీద y అను వేరొక రాశి యొక్క విలువ ఆధారపడినపుడు y = f(x) అనగా 'y' అనురాశి 'x' అను రాశియొక్క ప్రమేయము ('y' is a function of 'x') అని వ్రాయుదురు. 'మన పూర్వకర్మను బట్టి ప్రస్తుత (వర్తమాన) ఫలితములు ఉండును' అని కర్మ సిద్ధాంతము చెప్పును. నిన్న అమితముగా తినిన ఆహారమును బట్టి నేడు అజీర్తిగాని, కడుపులో నొప్పిగాని, వాంతులుగాని

పచ్చుటు జరుగుననునది తెలిసిన విషయమేగదా! కాబట్టి, ఈ కర్మసిద్ధాంతమును సంకేతపూర్వకముగా- నేడు = f(నిన్న) అని వ్రాయవచ్చును. రేపువచ్చుపరికి, 'నేడు ⇒ నిన్న' అగును. 'రేపు⇒నేడు' అగును కాబట్టి, అపుడు ఇదే కర్మ సిద్ధాంతమును- రేపు = f (నేడు) అని వ్రాయవచ్చును. దీనినిబట్టి నేడు మనము చేసిన పనులను బట్టి రేపటి మన జీవితము ఆధారపడును లేదా వర్తమానజీవితమును బట్టి భవిష్యజ్జీవితము ఆధారపడివుండునని ఈ కర్మసిద్ధాంతము చెప్పును.

పై బీజగణిత ప్రకారము వివరించిన కర్మసిద్ధాంతమును జాగ్రత్తగా అర్థము చేసుకొనవలెను. y = f (x)అని వ్రాసినపుడు, x యొక్క విలువమీద y విలువ ఆధారపడునని అర్థముగదా! ఒక వేళ x యొక్క విలువ మారినచో y విలువకూడ మారును. ఒక ఉదాహరణ చెప్పుకొనినచో కర్మసిద్ధాంతములోని సునిశితమైన ఆధ్యాత్మిక విషయము, పురుషప్రయత్నముయొక్క ప్రమేయము' ఆవశ్యకత అర్థమగును. లేనిచో ఇట్టి కర్మసిద్ధాంతము మెట్టవేదాంతములోనికి దారితీయవచ్చును.

వివాహమై ఐదు సంవత్సరములైన భార్యాభర్తలున్నారు. వారికొక కూతురుకూడ గలదు. వారికాపురము మరియొక ఐదు సంవత్సరములతరువాత ఎట్లుండునో తెలుసు

కొనుటకు కంప్యూటర్‌ను ఉపయోగించినచో సమాధానము వచ్చును [illegible] అని, ఆ కంప్యూటర్‌కు ఆ భార్యాభర్తల ప్రస్తుత పరిస్థితులను In put గా feed చేసినచో దానిని బట్టి 5 సం॥ తరువాత వారి కాపురము ఎట్లుండునో out put గా సమాధానము వచ్చును. పరిస్థితులు-

(1) భర్త ఇంటికి రోజూ ఆలస్యముగా వచ్చుచున్నాడు.

(2) కొన్నికొన్ని రోజులు ఇంటికి గూడా వచ్చుటలేదు.

(3) జీతమునుగూడా సక్రమముగా ఇంటి ఖర్చులకు వాడుటలేదు.

(4) భార్యకై పండగలకుగూడ క్రొత్తచీర మొదలగునవి కొనిపెట్టుటలేదు.

(5) భార్య చదువుకొన్నదైనను చాల సహనముతో వుండి సర్దుకుపోవుచున్నది. కాని అప్పుడప్పుడు భర్త ప్రవర్తనకు విసుగు, కోపముగూడ వచ్చుచున్నది.

ఈ ప్రస్తుత పరిస్థితులను కంప్యూటర్‌కు In put గా feed చేసినచో "5 సంవత్సరముల తరువాత ఆ భార్యాభర్త లిరువురు విడాకులు తీసుకొందురు." అని కంప్యూటర్ సమాధానము చెప్పును! ఇది విధివ్రాత వంటిది. ఈ సమా

ధానము వచ్చునని మనము తేలికగానే ఊహించవచ్చును గూడా! అయితే 'ఇట్లు జరుగుట తప్పదా?' అని ప్రశ్న, (Is it destined ?) ఇదిజరుగకుండుటకు అవకాశము గలదు. ఎప్పుడు ? ఈ రాబోవు 5 సంవత్సరములలో భర్త ప్రవర్తన మారి ఇంటికి రోజూవచ్చుట, ఇంటి సంగతులను పట్టించు కొనుట, పండుగలకు- భార్యకు, పిల్లలకు బట్టలుకొనుట మొదలైన మార్పులు వచ్చినచో- '5 సంవత్సరములలో పునే వారికి ఒక పిల్లవాడుకూడ పుట్టవచ్చును. ఇంటిలోనికి క్రొత్త సామానుకొనుట మొదలైనవికూడ జరుగవచ్చును' అని కంప్యూటర్ సమాధానము ఇవ్వవచ్చును. ఇది పురుష ప్రయత్నఫలితము. దీనిని బట్టి 'వారి జీవితము ఇక ఇంతే! విడాకులు తప్పవు' అని చెప్పుట తప్పుగదా ! కర్మసిద్ధాంత మును సరిగా అర్థము చేసుకొననివారు, మెట్టవేదాంతులు ఆ విధముగా చెప్పుదురు, కాని కర్మసిద్ధాంతముపై సరియైన శాస్త్రీయ అవగాహన కలవారు ఆ విధముగా చెప్పరు. జ్యోతిశ్శాస్త్రముగూడ 'Stars will condition you but not compel you' అనియే చెప్పును. అనగా, 'గ్రహములు ప్రతికూలపరిస్థితులను తెలియచెప్పునుగాని, నిన్ను ప్రతి కూలమును సృష్టించుకొనమని ప్రలోభపెట్టవు' అని అర్థము. కావున, పురుషప్రయత్నమువల్ల ఎన్నో మార్పులు వచ్చుటకు అవకాశముగలదని తెలుసుకొనవలెను. ఒక పాము ఎదురుగా

వచ్చుచున్నపుడు - 'మన గీతలో అది కలవాలని వ్రాసి యున్నచో అది కలవక మానదు, వ్రాసి లేనిచో కలవదు' అని అక్కడే నిలబడి మెట్టవేదాంతమును ఎవ్వరును చెప్పరు. ప్రక్కకుతొలగి తప్పించుకొను పురుష ప్రయత్నమును చేయుదురు. అట్లే, ఒకడు రాయిని విసిరినపుడు మనగీతలో అది తగలవలెనని వ్రాసియున్నచో తగులును, బొప్పికట్టవలె నని వ్రాసియున్నచో బొప్పికట్టును లేనిచో లేదు' అని అక్కడనేనిలబడరు. దెబ్బనుండి తప్పించుకొను పురుష ప్రయత్నమును తప్పక చేయుదురు. పురుష ప్రయత్నమును చేసిననూ విపత్కరపరిస్థితులనుఎదుర్కొనవలసి వచ్చినపుడు వాటిని తన పూర్వకర్మఫలముగా, విధివ్రాతగా జమకట్టు కొనుట సరియైన పద్ధతి. అంతేగాని, తాను ఏమియు చేయక కూర్చుండి విధివ్రాతనుతిట్టుకొనుట తప్పు. అనగా విధి వ్రాతను హెచ్చరిక (Warning) గాను, పురుషప్రయత్న మును అందుకు తీసికొను జాగ్రత్త (Precaution) గాను అర్థము చేసికొనవలెను. అందుచేతనే ఇవి రెండును ఒకదాని కొకటి పరిపూరకములని చెప్పబడినవి.

పైన వివరించిన విషయములనుబట్టి మానవునియొక్క ప్రస్తుత, తక్షణ ప్రవర్తన, ప్రయత్నములనుబట్టి రాబోవు కాలములో వాని జీవితవిధానము మారునని చెప్పుటకు సందేహపడరాదు. అందువలననే ప్రస్తుత, తక్షణప్రవర్తనల

విషయమై జాగ్రత్తగా ఉండవలెనని ఈ తైత్తిరీయోపనిషత్తు నందలి శిక్షావల్లిలోని చివరి అనువాకమునందు ఆచార్యుడు శిష్యునకు అనుశాసనపూర్వకముగా ఉపదేశము చేయును. ఈ భృగువల్లిలోగూడ ఈ చివరిఅనువాకములో ఇదే విషయము - మనోవాక్కాయకర్మలపట్ల వహించవలసిన జాగ్రత్తనుగురించి చెప్పబడినది. (ఏది ఎట్లుజరుగవలెనో అట్లే జరుగుచున్నపుడు- నీతివాక్యములు, సూక్తులు, పెద్దల మాటలు, అనుభవములుఅన్నియు దండగయేకదా!) కావున, ఈ విషయమును యోగసాధకుడు తెలిసికొని, వాక్కులను కూడా జాగ్రత్తగా ఉపయోగించవలెను. వాఙ్నియమును కలిగి అవసరమైనపుడు మాత్రమే వాక్కులను ఉపయోగించినచో వాక్కులకుసిద్ధికలిగి,భావిజీతము క్షేమంకరముగా ఉండి, ఇతరులకిచ్చు సలహాలు సత్ఫలితములను ఇచ్చును.

'యోగము' అనగా లేనిదానిని పొందుట, ఆపొందుటలో గూడా అన్నిటి సమన్వయమును సాధించి పొందుట. 'క్షేమ'మనగా 'ఆ పొందినదానిని నిలబెట్టుకొనుట' ఈ యోగక్షేమములు రెంటిని ప్రాణాపానములవలె విడదీయరాని జంటగా యోగసాధకుడు పొందునని, వానిపాదములు సన్మార్గములోనే ధర్మా [illegible] మార్గముల ప్రభావములకు లోనుకావు, ఇది ధ్యేయమును పొందుటలో ముఖ్యమైన ఉపయోగమని ఉపాసించవలెను

అర్థములో "క్షేమ ఇతి వాచి।... కర్మేతి హస్తయోః" అని చెప్పబడినది.

సాధారణముగా ఇతరులపై దురూహాలను, దురభిప్రాయములను నిర్లక్ష్య, వైముఖ్యములను కలియుండుట సామాన్యమానవుని లక్షణము. ఇట్టి దురూహా, దురభిప్రాయ నిర్లక్ష్య, వైముఖ్యాది దుర్లక్షణములు అనవసరమైనవి. 'మన శరీరములోని మూత్ర, పురీషములను ఎట్లు విసర్జింతుమో అట్లు ఈ పై దుర్లక్షణములను విసర్జించి విముక్తి పొందవలెను' అను అర్థములో 'విముక్తి రితిపాయౌ' అని చెప్పబడినది. ఇంతవరకు బాహ్యముగా మనిషి ఉపాసించవలసిన కొన్ని విషయములు చెప్పబడినవి. ఇకముందు దైవీసంపత్తికి సంబంధించిన, జ్ఞానప్రాప్తికి కారకములైన ఉపాసనములు చెప్పబడును.

మనిషి సుఖమయ జీవితమును పొందుటకు తృప్తి చాల అవసరము. మనము చేయవలసిన ప్రయత్నము పూర్తిగా చేసి అందువలన వచ్చిన ఫలితమును స్వీకరించుట మంచిలక్షణము. ఒక్కొక్కప్పుడు ఎంతకష్టపడిననూ ఆశించిన ఫలితమును పొందలేక పోవచ్చును. అసలు ఫలితమును ఆశించుట సరియైన పద్ధతికాదు. వచ్చిన ఫలితమును స్వీకరించుటయే చేయువలెను. (1) యదృచ్ఛా లాభసంతుష్టో .. (2) కర్మణ్యే వాధికారస్తే.. ....గీతాశాస్త్రము) ఉన్న

ఆదాయమునుబట్టి ఖర్చుచేసుకొనుట, లేనిదానికి దురాశ పడకుండుటనియమములుగాగలవానికిజీవితము సుగమముగా నుండును. తిన్నదానిని తృప్తిగా తినవలెనుగాని లేని దానిని గూర్చి ఆరాటపడరాదు. కాబట్టి ఈ తృప్తిలేనిచో మనిషి జీవితములో సుఖశాంతులు ఉండవనుఉద్దేశ్యముతో 'తృప్తి రితి వృష్టౌ' అని చెప్పబడినది.

తీగలలో విద్యుత్తు నిక్షిప్తముగానుండి రేడియోను పలికించి, విద్యుచ్ఛామరములను ఎట్లు త్రిప్పగలదో అట్లే, మనలో బలము కళ్ళకికనపడకపోయిననూ మనచేపలికించుట, నడిపించుట, మొదలగు కార్యములను చేయును కావున బలమును విద్యుత్తుతో సమన్వయపరచుచు 'బల మితి విద్యుతి' అని చెప్పబడినది.

కీర్తిప్రతిష్ఠలను-సంపదను వినియోగించు పద్ధతినిబట్టి పొందుదురని, 'సంపద' అనగా 'ఇతరులకు, తనకును కూడ సంతోషమును కల్గించునది, సుఖమును చేకూర్చునది, అభివృద్ధికి కారణమగునది' అని భారతీయుల అభిప్రాయము. అందుచేతనే ధనమనగా నోట్లకట్టలు కాదని-అగ్ని, వాయువు, సూర్యుడు, భూమి, పశువులు మొదలైనవే నిజమైన ధనము లేక సంపద- అని ('ధనమగ్ని ర్ధనం వాయుః ధనం సూర్యో ధనం వసుః.....,'అని శ్రీ సూక్త ఫలశ్రుతి) అందుచేతనే

ఎవరినైనా దీవించునపుడు 'ప్రజయా పశుభి ర్బ్రహ్మ వర్చసేన...' అనగా సత్సంతానముతో; గో, వృషభాది పశుగణముతో; స్వచ్ఛమైన వర్చస్సుతో వర్ధిల్లమని భారతీయులు దీవించెడివారు. ఒకరికి దానమిచ్చునపుడు గూడ అభివృద్ధికారకములైన పశువులనుఇచ్చి తమ కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించుకొనెడివారు. అందుచే ఇక్కడ 'యశ ఇతి పశుషు' అని చెప్పబడినది.

'తారలు' అను ఉద్దేశ్యముతో ఇచ్చట నక్షత్రములు అన్న పదము వాడబడినది. వాస్తవమునకు రాశిచక్రములో 27వ వంతును 'నక్షత్రమ'ని, ఆకాశములో కనపడు చుక్కలు 'తారల'ని (Stars) తెలియవలెను. కాని, ఇక్కడ నక్షత్ర ములనగా 'తారలు' అను అర్థమునే చెప్పుకొనవలెను. ఈ తారలు చంద్రునివలె, గ్రహములవలె కాక స్వయంప్రకాశ మైనవి (Self Luminous Bodies), సూర్యుడు మనకు అతి దగ్గరగాఉన్న తారయే! మన లోవెలుగు (Inner light) అనగా ఆత్మ-జ్యోతివంటిది. పరమాత్మ - పరంజ్యోతి. 'తారలవెలుగులు ఎట్లు స్వయంప్రకాశమైనవో, మనలోని జ్యోతిస్స్వరూపమైనఆత్మగూడాస్వయంప్రకాశమానమైనది' అను అర్థములో 'జ్యోతి రితి నక్షత్రేషు' అని చెప్పబడినది.

ఎవరికైనా తనస్థితి చెడనపుడు ఆనందము కల్గును. తను మృతుడు కానపుడు ఆనందము కల్గును. మరణము

దుఃఖమును కల్గించును. తన శుక్రమే కుమారుడుగా పుట్టి నపుడు తానే మరల పుట్టినట్లు లెక్క, తన శరీరములోని ఒక భాగమే మరల పుత్రుడుగా పుట్టుచున్నాడు. కాబట్టి, తండ్రికి మరణములేదని భావము, దీనినే మనిషి 'అమృతత్వ వంతుడగుట' అందురు. "ఇది సిద్ధించునపుడుపొందు ఆనందము ఉపస్థేంద్రియము (జననేంద్రియము) ద్వారా కలిగినది" అను అర్థములో 'ప్రజాతి రమృత మానంద ఇత్యుపస్థే' అని చెప్పబడినది. 'స్థ—అనగా ఉండుట, ఉపస్థ- అనగా గౌణముగా ఉండుట'గా, అనగా 'తండ్రి-కొడుకు అగుటను' 'స్థ-ఉపస్థ అగుట'గా చెప్పుకొనవచ్చును.

ఏమియు లేనట్లుగాకనపడు ఆకాశమునుండి అన్నియు వున్నట్లు కనపడు భూలోకమువరకు (From seeming nothingness to apparent something) ఈ సృష్టిజరిగినది. (ఆకాశా ద్వాయుః .. అద్భ్యః పృథివీ) కావున, మనము చూచు భౌతికపదార్థమునకు మూలఉత్పత్తి కేంద్రము సూక్ష్మతమమైన ఆకాశము. కాని, 'ఆకాశమునుండి ఏమి పుట్టును?' (ఆకాశం గగనం శూన్యం) అని అన్పించును. కాని, ఆకాశం గగనం పూర్ణం' అని తెలుసుకొనవలెను. ఉప్పు, పంచదార, పటికబెల్లము మొదలైనవి కరిగియున్న నీటిని చూచినపుడు నీరువలెనే కనపడునుగాని ఆ ఉప్పు, పంచదార, పటికబెల్లములు గోచరించవు. అంతమాత్రము

చేత ఆ నీటిద్రావణములో ఆ పదార్థములు లేవని అనుట మన అవివేకము, అదేవిధముగా జగత్తులోని సర్వపదార్థములు చక్కగా కరిగి లేదా లీనమైఉన్న సూక్ష్మతమమైన స్థితిలోని ద్రవ్యమును ఆకాశముగా అర్థము చేసుకొనవలెను. అందుచేతనే పంచభూతములలో దీనిని మొదటిదానినిగా గుర్తించిరి. ఇద్దరిమధ్యచోటు ఈ ఆకాశమే, 'జగత్తులో అన్నిటికన్న అమాయకముగా కనబడునదిఏది?' అని ప్రశ్న వేసినపుడు ఆకాశము లేదా 'చోటు' అని చెప్పవచ్చును. దీనిలోని రహస్యములనే మానవుడు విజ్ఞాన శాస్త్రము ద్వారా ఒక్కొక్కటి గ్రహించుచున్నాడు. అందుచే 'సర్వము ఆకాశమునందే ఉన్నది' అను అర్థములో 'సర్వమిత్యాకాశే' అని ఇక్కడ చెప్పబడినది. 'దీనిప్రతిష్ఠను ఉపాసించి తెలుసుకున్నవాడుకూడ జగత్తుపట్ల, సృష్టిపట్ల, విజ్ఞానముపట్ల, సుస్థిరమైన అభిప్రాయములు లేదా జ్ఞానము కలిగినవాడు అగును' అను అర్థములో 'తత్ప్రతిష్ఠేత్యుపాసీత! ప్రతిష్ఠావా న్భవతి' అని చెప్పబడినది.

ఆకాశమును మహిమాన్వితమైన దానిగా లేదా మహత్తును (Universal mind) కలిగినదానిగా ఉపాసించువానికి ఆ విశ్వమనస్సుతో తనమనస్సు అనుసంధానపరచబడి (Tune) తానుగూడ మహనీయుడగును. కొందరికి 'చోటుకు మనస్సు ఉండునా?' అని సందేహము కలుగవచ్చును,

చోటులో చెంబు ఉండుటచే చెంబులో చోటుఉన్నట్లు జగత్తుఅంతానిండివున్న ఈవిశ్వమనస్సులో మనబుద్ధి వుండుటచే మన బుద్ధిలోగూడ వ్యక్తిగత మనస్సు ఉండుటకు అవకాశమేర్పడినదని తెలియువలెను, వ్యక్తిగతమనస్సు విశ్వమనస్సుతో అనుసంధానము జరిగినపుడే మహత్తరమైన సత్యములు స్ఫురించునను అర్థములో 'మహాన్భవతి' అని చెప్పబడినది. చోటులోని విశ్వమనస్సుయొక్క భాగమే మనిషిలోని మనస్సు. దానిని కలిగినవాడే మానవుడు. అందుచే ఈ ఉపాసనలో సరైన అర్థము తెలిసిన'మనస్సు'ను కలిగినవాడగుచున్నాడు అను అర్థములో 'మానవాన్భవతి' అని చెప్పబడినది.

సృష్టి - పై నుండి క్రిందకు లేదా ఆకాశమునుండి భూమికి (ఊర్థ్వమునుండి అధస్సునకు) జరుగునను విషయమునుబట్టి ఆకాశము పైనుండి క్రిందకుదిగుటకు వంగుచూ, వంగుచూ సూక్ష్మస్థితినుండి స్థూలస్థితిని పొందుటలో భౌతిక సృష్టి జరిగినది. "ఇట్లు 'పైనుండి క్రిందకి వంగుట' ఆకాశమునకుకలదని ఉపాసించి తెలిసికొనినవానికి అవసరమగునవన్నియు వాని దగ్గరకు నడిచివచివచ్చును" అను అర్థములో 'తన్నమఇత్యుపాసీత । నమ్యంతే ఒస్మై కామాః' అని చెప్పబడినది.

ఆకాశము విత్తనమువలె అతిసూక్ష్మముగావున్నను ఇంతభౌతిక సృష్టిగా శాఖోపశాఖలతో వృక్షమువలె విచ్చుకొనుచున్నది. ఆకాశమునందుగల ఈ విచ్చుకొనెడిశక్తిని 'బృహ్మణశక్తి అందురు. ఈ బృహ్మణశక్తికలదానినిగా ఆకాశమును ఉపాసించి, గ్రహించినవాడు తానుగూడ అట్టి బృహ్మణశక్తి కలిగి బ్రాహ్మణుడగును. ఈ బృహ్మణశక్తి వలననే ఎట్టి విషయమునైనను చక్కగా విపులీకరించి చెప్పకలుగును. అట్టివాడే బ్రాహ్మణుడు. ఈ అర్థములో' తద్బ్రహ్మేత్యుపాసీత! బ్రహ్మవాన్భవతి' అని చెప్పబడినది.

చోటు కదలనపుడు ఆకాశమని, కదలినపుడు వాయువని తెలుసుకొనవలెను. విద్యుత్తు, వర్షము, చంద్రకాంతి, సూర్యదీప్తి, అగ్నిప్రభ ఇవి ఈకదిలెడుచోటునందు అనగా వాయువునందు లీనమగును. ఇట్టి లీనమొనర్చుకొనువాయువుడు 'పరిమరము అందురు. చోటుకదులుటనుబట్టి ఆకాశముకన్న వాయువు వేరుగా గుర్తింపబడుచున్నదేగాని రెంటికీ అభేదమే! కాని, ఈ కించిత్ భేదమును తెలియుటలగాను ఆకాశమునకు- వాయువు 'పరిమరము' అందురు. బ్రహ్మకు ఆకాశమునకుకూడ అభేదమే! ఐనను, ఇదేవిధముగా బ్రహ్మకు— ఆకాశము 'పరిమరము' అని గుర్తించవలెను. అనగా 'బ్రహ్మకు- ఆకాశమెట్లో, ఆకాశమునకు-వాయువు అటువంటిదని ఉపాసనద్వారా తెలుసుకొనువానికి ఇతరుల

యెడ భేదభావము, ద్వేషభావము పుట్టదు. అందుచే శత్రువులు ఏర్పడుటకు అవకాశముపుండదు. చివరకు అప్రియులలోగూడ శత్రువులుకన్పడరు. ఈ శత్రుభావనరాని ఆత్మస్వరూపుడుగా తయారై తనలో ఎవడువున్నాడో, ఎదుటివారిలోకూడ వాడేవున్నాడని, వాడే ఆ సూర్యునిలోగూడ వున్నాడని ఈ విధముగా అందరిలోను వ్యక్తమగువాడు ఒకేఒక పురుషుడని తెలుసుకొనుస్థితికి వచ్చునను అర్థములో 'తద్బ్రహ్మణః పరిమర.... య శ్చాసౌ వాదిత్యే। స ఏకః' అని చెప్పబడినది. (క్షేమ ఇతి వాచి।' నుండి 'స ఏకః ।' అను మంత్రమువరకు పరమాత్మయొక్క వ్యక్త వైభవములు చెప్పబడినట్లుగూడ గ్రహించవలెను.)

పైన చెప్పబడిన విషయములలోని ఆంతర్యమును అంతరార్థమును కూలంకషముగా తెలిసికొనినవాడు ఈ లోకమును విడిచి-అన్నమయాత్మని, ప్రాణమయాత్మని, మనోమయాత్మని, విజ్ఞానమయాత్మని, ఆనందమయాత్మని అవసరమునుబట్టి పొందగలడు. అనగా, తాను వచ్చిన క్రమము ఆనందమయ, విజ్ఞానమయ, మనోమయ, ప్రాణమయ, అన్నమయకోశములవరుసలో కాగా- భౌతిక లోకమును విడుచునపుడు దీనికి సరిగా వ్యుత్క్రమ (తలక్రిందు) మార్గములో అనగా, అన్నమయ, ప్రాణమయ,మనోమయ విజ్ఞానమయకోశముల వరుసక్రమములో ఆ యా కోశము

లకు సంబంధించిన వానిగా మారుచు చివరకు ఆనందమయా త్ముడగునను అర్థములో "స య ఏవం విత్ .... ఆనందమయ మాత్మాన ముపసంక్రమ్య" అని చెప్పబడినది. వెలుగు చున్న కొవ్వొత్తిని పరిశీలించినచో అట్టడుగున గట్టికొవ్వు, దానిపైన ద్రవస్థితిలోని కరుగుచుండెడికొవ్వు, దానిపైన అగ్నిస్థితిలోని వెలుగుకొవ్వు, దానిపైన వాయుస్థితిలోని కొవ్వు కనపడి చివరకు ఆ వాయుస్థితిలోనికొవ్వు ఊర్ధ్వ మార్గముగా ఆకాశమును పొందునట్లు ఈ జీవుడు అన్న మయాది కోశములువిడిచి ఆనందకోశమును పొంది ఆనంద మయుడగును.

ఒక కోశమునకు ఒక కోశమునకు మధ్యగా ఉన్న దానిని 'సంధి' అందురు. క్రిందికోశము 'అన్నము' ఐనచో, దానిపైకోశము 'అన్నాదము' అగును. అనగా, ప్రతి ప్రక్క- ప్రక్కల కోశముల జంటను అన్న- అన్నాదములజంటగా తెలియవలెను. 'ఈ జంటమీాద ఆధారపడియే ఆయా కోశ ములకు తగినరూపములతో సంచరించుచూ ఉన్నాడు' అను అర్థములో 'ఇమా న్లోకాన్ కామాన్నీ కామరూప్యను సంచరన్' అని చెప్పబడినది.

బ్రతుకునకు ఆధారము శ్వాస, శ్వాస-ఉచ్ఛ్వాస, నిశ్వాసముల జంట, ఈ జంటలో ఒడుదుడుకులు ఉన్నప్పుడు

గాని లేదా వియోగమేర్పడినపుడుగాని మరణమునకు దారి తీయును. అందుచేతనే ఆరోగ్యవంతునిలోని ఉచ్ఛ్వాస, నిశ్వాసములు సమముగా ఒకదాని తరువాత నొకటి సృష్టి-ప్రళయములవలె, వెలుగు-చీకట్లవలె, కంటిరెప్పలు తెరచుట-రెప్పలుమూయుటలవలె, పగలు- రాత్రులవలె, శుక్లపక్షము - కృష్ణపక్షములవలె, ఉత్తరాయణ - దక్షిణాయనములవలె, ఉదయకల్ప - క్షయకల్పములవలె, జరుగుచుండును. బయట నుండి గమనించు వానికి వీటి నిరంతర ఆవర్తనము (Periodicity) లో ఒక గానము వినపడును. సమముగా జరుగు ఈ గానమును'సామ గానము' అందురు. ఉచ్ఛ్వాసమును 'హా' అను అక్షరము తోను, నిశ్వాసమును 'ఉ' అను అక్షరముతోను, ఇక్కడ సంకేతించినట్లు అర్థము చెప్పుకొనిచో 'హా' అనునపుడు పెదవులు తెరుచుకొనుటను, ఆ విధముగా తెరుచుకొని నపుడు గాలి లోపలికిపోవుటను సూచించును. అట్లే, 'ఉ' అనునపుడు పెదవులు దగ్గరకు వచ్చి మూతపడుటను, లోని గాలి బయటకు నెట్టబడుటను, సూచించును. అదియునుగాక 'హా' అనునపుడు గాలి ఎక్కుటను, దానిననుసరించి జనన మును; 'ఉ' అనునపుడు గాలి దిగజారుటను, దానిననుస రించి మరణమును సూచించును. మరియు, 'హా' అనునపుడు నోరు తెరవబడుట— స్వీకరించుటను, 'ఉ' అనునపుడు నోరు

మోయబడుట-విడుచుటను తెలియజేయును. ఈఉచ్ఛ్వాస నిశ్వాసములు లేదా ఎక్కుట,-దిగుటలు లేదా స్వీకరించుట-విడుచుటలు, లేదా జనన- మరణములు, ఒకదాని తరువాత ఒకటి జరుగుచుండునని తెలియచేయునట్లుగా 'హావు''హావు' 'హావు' అను సామగానము ఈ ఆనందమయుడు చేయునని చెప్పబడినది. ఇది 'ఆశ్చర్యకరమైన విషయము'. అనిగూడా 'హా' 'వు' అను పదములకు అర్థము కలదు.

ప్రతికోశము అన్నము, అన్నాదముకూడ అగుచుండుట వలనను, 'హావు', 'హావు' అను శ్వాసాత్మక సామగాన శ్లోకమును నిరంతరము చేయుచుండువాడగుట చేతను ఆనందమయుడైన 'నేను'- 'అహ మన్నం' అని'అహ మన్నాదః' అని 'అహగ్గ్ శ్లోకకృత్' అని ఇక్కడ చెప్పబడినది.

గృహయజమాని గృహములో ఉండును.గృహమును కట్టకపూర్వము గృహయజమాని లేడనుట అవివేకము.అట్లే, ఆత్మస్వరూపుడైన జీవుడు దేహమును కట్టుకొనకపూర్వము లేడనుటకూడా అవివేకమే! న్యాయమునకు గృహమునందలి కిటికీలు, ద్వారబంధములు, తలుపులు మొదలైనవాటికన్న, గృహముయొక్క గోడలకన్న, గృహనిర్మాణపు బ్లూప్రింట్ కన్న, 'గృహమునుకట్టవలెనను మన స్సంకల్పముకన్న,

గృహమును కట్టవలెనను నిశ్చయాత్మక బుద్ధికన్న, కట్టుటకు అవసరమగు ద్రవ్యమును సంపాదించుటకు కావలసిన తెలివి తేటలుకన్నకూడా ముందువున్నవాడు ఈ గృహయజమాని ఈ తెలివితేటలను- దేవతలతోను, సంకల్పమును- మనస్సుతోను, నిశ్చయాత్మకబుద్ధిని- ఋతముతోను పోల్చినచో, 'వీటన్నిటికన్న గృహమునకు గృహయజమానివలె వీటన్నిటినీకల్గిన దేహమునకు జీవాత్మ అటువంటి ప్రథముడు' అను అర్థములో 'అహ మస్మి ప్రథమజా... పూర్వందేవేభ్యో' అని చెప్పబడినది. రెండు తరములనుసంధించి, సృష్టియొక్క నిరంతరత్వమును తల్లీ-బిడ్డలమధ్య నాభి ఎట్లు తెలియచేయునో, పరమాత్మ జీవాత్మగా వ్యక్తమగునపుడు "నేను" అనునది అట్టి సంధానమునుచేయును. "ఈ సంధానమువలన బ్రహ్మసూత్రము తెగకుండా'అవరోధము'అను'మృతత్వము' లేనిదగు 'అమృతత్వము'ను సిద్ధింపచేయును"అను అర్థములో 'అహం అమృతస్య నాభా ఇ' అని చెప్పబడినది.

ప్రపంచములో ఉల్లి - ఎలుకకు ఆహారము కాగా, ఎలుక- పిల్లికి ఆహారము, పిల్లి-కుక్కకు... ఈ విధముగా ఒకరికొకరు అన్నము-అన్నాదము (తినబడునది: తినునది) అగుచున్నారు,ఐననూ బ్రతికినంతకాలముజీవులుబ్రతుకుచూ సృష్టికార్యము జరుగుచునే యున్నది. ఒకవిధముగా

చెప్పవలెనన్నచో "ఒకరికి అన్నమును ఏర్పాటుచేసినవాడే మరియొకరికి ఈ ఒకరిని అన్నముగా ఏర్పాటు చేయుచున్నాడు' అనునది నిజమేగదా! దీనిని చెప్పుటకే రక్షించుటకు, భక్షించుటకు వాడే కారకుడు. అను అర్థములో 'యో మా దదాతి స ఇదేవమా౽౽వాః' అని చెప్పబడినది.

అన్నమును, అన్నమును తినువానిని కూడా ఈ'నేను' తినుచున్నాడు అను అర్థములో 'అహమన్న మన్న మదంతమాద్మి' అని చెప్పబడినది. ఈ పైన చెప్పిన కారణములుగా ఈ 'నేను' చతుర్దశభువనములకు కారకమైకూడా దానికతీతముగా ఉన్నాడను అర్థములో 'అహం విశ్వం భువనమభ్యభవామ్' అని చెప్పబడినది. సూర్యుని తేజస్సు స్వయం ప్రకాశము, మరియు, వివిధమైన మంచిమంచి రంగులనిచ్చునది. మనమెఱుగున్న బంగారమునకు ఈ సూర్యరశ్మి రంగు ఉండుటవల్లనే 'సువర్ణ'మని పేరు వచ్చినది. ఈసువర్ణదీప్తి ఎటువంటిదో- సూర్యరశ్మి ఎటువంటిదో ఈ 'నేను' కూడా అట్టి స్వయంప్రకాశ పరంజ్యోతి, ఈ సువర్ణజ్యోతి స్వరూపమైన 'నేను' నుండియే వివిధ వర్ణములు, క్షరాక్షరములు మొదలైనవన్నియు ఉత్పత్తియగును. ఈ 'నేను' మాత్రము దేనినుండి ఉత్పత్తికాను. ఈ 'నేను'- స్వయమ్భూః, స్వయంప్రకాశము (Self manifest, self

propelling, self luminous) అను అర్థములో 'నేను' ను గూర్చి 'సువర్ణ జ్యోతిః' అని చెప్పబడినది.

ఈ పైన చెప్పినవిషయములు తెలిసికొనువానికొరకు ఈ ఉపనిషత్తు చెప్పబడినది లేదా 'ఈపైన చెప్పబడిన విషయములన్నియు ఎవడు తెలుసుకొనుచున్నాడో వానిని గూర్చియే ఈ ఉపనిషత్తు చెప్పబడుచున్నది' అను అర్థములో 'య ఏవం వేద। ఇత్యుపనిషత్' అని అనువాకాంతమునందు చెప్పబడినది.

